




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 సంచిక : 152 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | శుక్రవారం 6 ఫిబ్రవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :152 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | FRI 6 FEBRUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# మేరా...హుకుం...

# శివునికే... కంపుసెగ...




- శివయ్యకే శఠగోపం పెడుతున్న మున్సిపల్ కమీషనర్
- స్థానిక ఏమ్మెల్యే కు తెలియకుండానే అంత జరిగిందా...?
- ఏపీ డీప్యూటీ సి.ఎం. పవన్ కల్యాణ్ సనాతనం ముద్దు అంటారు.
- గూడెం లో సనాతన ధర్మానికే కంపుకొట్టిస్తున్న జనసేన ఏమ్యెల్యే
- కావాలనే అధికారులు హిందువులను రెచ్చగొడుతున్నారా..?
- శివాలయం పక్కనే టాయిలెట్స్?
- అభివృద్ధి పేరుతో హిందూ మనోభావాలపై దాడి!
- సులభ కాంప్లెక్స్‌లు ఉన్నా పింక్ టాయిలెట్స్ ఎందుకు?
- తాడేపల్లిగూడెంలో మున్సిపల్ అధికారుల కాసులు కక్కుర్తిపై ప్రజల ఆగ్రహం

వివరాలు 2లో...

తాడేపల్లిగూడెంలో శివాలయం సమీపంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు చేసిన ప్రయత్నం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే తాలుకా అఫీస్ పరిసర ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఇంచు మించూ ఇక్కడే ఉంటాయి... టౌన్ పోలీస్ స్టేషన్, ఎండీఓ ఆఫీస్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యలయం, ట్రజరీ కార్యలయాలు ఉంటాయి. అన్నా క్యాంటిన్ వెనుక వైపు సులభ కాంప్లెక్స్ ఉంది. మరోక సులభ కాంప్లెక్స్ కూతవేటు దూరం కోర్టు ప్రక్కనే ఉంది. ఈ ప్రాంతంలో రెండు సులభ కాంప్లెక్స్‌లు అందుబాటులో ఉండగా, పవిత్ర శైవ క్షేత్రానికి అతి సమీపంలో మరో నిర్మాణం అవసరమా? అన్న ప్రశ్నకు ఇప్పటివరకు సమాధానం లేదు. శివరాత్రి వంటి మహా పర్వదినం సమీపిస్తున్న వేళ, వేలాది భక్తులు తరలివచ్చే శివాలయానికి ఇలాంటి నిర్మాణ ప్రతిపాదనలు రావడం హిందూ సమాజ మనోభావాలను పరిగణనలోకి తీసుకున్నారా? అనే సందేహాలను పెంచుతోంది. ఇది అభివృద్ధి ఆలోచన కంటే, పరిస్థితుల అంచనాలో లోపమా? అనే చర్చకు దారి తీసింది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పలు సందర్భాల్లో సనాతన ధర్మ పరిరక్షణపై స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాంటి రాజకీయ నేపథ్యం ఉన్న ప్రాంతంలో, స్థానిక జనసేన ఎమ్మెల్యేకు ముందుగా సమాచారం లేకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారా? లేక ప్రజాప్రతినిధులతో సంప్రదింపులే జరగలేదా? అన్నది స్పష్టత కావాల్సిన అంశం. ఇక్కడ అసలు సమస్య నిర్మాణం కాదని, స్థలం ఎంపిక, ప్రజల భావోద్వేగాలు, పరిశుభ్రత ప్రమాణాలు. ఇవన్నీ పక్కన పెట్టి ముందుకెళ్లడం వల్లే ఈ వివాదం ఉత్పన్నమైందని విశ్లేషకులు అంటున్నారు.

తాడేపల్లిగూడెం, పెన్ పవర్ ఫిబ్రవరి 05 :



## బొగ్గు గనిలో పేలుడు... 16 మంది మృత్యువాత

- మేఘాలయలోని బొగ్గు గనిలో భారీ పేలుడు
- ఘటనలో 16 మంది కార్మికులు మృతి
- మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

పెన్ పవర్ డెస్క్:మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్ఘె ప్రాంతం లోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, 16 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి

- మిగతా 2లో...



## తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు

### ఢిల్లీలో వైసీపీ ఎంపీల మీడియా సమావేశం

- లడ్డూ నెయ్యిలో కొవ్వు ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్న వైసీపీ ఎంపీలు
- సీబీఐ, సిట్ నివేదికల్లో క్లీన్ చిట్ వచ్చిందని వెల్లడి
- సత్యశోధన పరీక్షకు సిద్ధమన్న టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- రాజకీయ లబ్ధి కోసమే కూటమి విషప్రచారం చేస్తోందని ఆరోపణ
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ కుట్రలన్న వైసీపీ


- మిగతా 2లో...

## వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు మేమే చెల్లిస్తాం



- ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యమని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ ఉండదని కీలక హామీ
- వైసీపీ ప్రభుత్వంలో పెండింగులో ఉన్న బిల్లులు కూడా చెల్లిస్తామని భరోసా
- పరుగెత్తే నీటిని నిలిపి భూగర్భ జలాలు పెంచాలని సంఘాలకు సూచన
- ప్రత్యామ్నాయ పంటలతో రైతుల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటామని వెల్లడి

వివరాలు 2లో..



## పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో భారత్ 'వాయు' గర్జన

- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో వాయుసేన భారీ విన్యాసాలు
- ఫిబ్రవరి 27న జైసల్మేర్‌లో 'వాయు శక్తి 2026' పేరిట ప్రదర్శన
- 'ఆపరేషన్ సిందూర్' తరహాలో సాగనున్న ఎక్సర్‌సైజ్
- రఫేల్, సుఖోయ్, తేజస్, మిగ్-29 యుద్ధ విమానాలతో ప్రదర్శన
- తొలిసారిగా మిగ్-21 లేకుండా జరగనున్న వైమానిక విన్యాసాలు

వివరాలు 2లో..

## తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు



పెన్ పవర్ డెస్క్:దఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు.

- మిగతా 2లో...


## నిరసనల మధ్య... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం...

# విపక్షాల వాకౌట్

- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని ప్రసంగం
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ప్రధాని మాట్లాడుతుండగా నినాదాలు.. సభ నుంచి వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు
- వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- భారత్‌తో వ్యాపారానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వ్యాఖ్య

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇస్తుండగా, విపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

- మిగతా 2లో...





## వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన

- రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన
- ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని వెల్లడి
- మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందన్న పీయూష్ గోయల్

- మిగతా 2లో...

# శివ శివ... ఏంత అపచారం..!

- మొదటి పేజి తరువాయి

తాడేపల్లిగూడెం పట్టణంలో మున్సిపల్ అధికారుల తాజా నిర్ణయం ప్రజా ఆగ్రహానికి దారి తీస్తోంది. పట్టణంలోని అత్యంత కీలకమైన తాలూకా ఆఫీస్ సెంటర్ ప్రాంతంలో రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎండిఓ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వంటి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న చోట... ఇప్పటికే రెండు సులభ కాంప్లెక్స్‌లు ప్రజలకు సేవలందిస్తున్నాయి. అయినా సరే, అదే ప్రాంతంలో మళ్లీ పింక్ టాయిలెట్స్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేయడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**పవిత్ర శివాలయానికి అవమానమా?**

ఈ ప్రతిపాదిత నిర్మాణ స్థలం ఒక వైపు శివాలయం, మరో వైపు అన్న క్యాంటీన్ మధ్యలో ఉండటం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. ముఖ్యంగా త్వరలో మహా శివరాత్రి పర్వదినం రానుండటంతో వేలాది భక్తులు శివాలయానికి తరలివచ్చే పరిస్థితి ఉంది. అలాంటి పవిత్రమైన శైవ క్షేత్రానికి అతి సమీపంలో టాయిలెట్స్ నిర్మించడం హిందువుల మనోభావాలను నేరుగా దెబ్బతీసే చర్యగా భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఇది అభివృద్ధి కాదు... ఇది హిందూ ధర్మంపై అవమానం" అని వారు మండిపడుతున్నారు.

**అన్న క్యాంటీన్ పక్కనే మరుగుదొడ్లా...?**

ఇంకో వైపు, రోజుకు మూడు పూటలు వందలాది మంది పేదలు, కూలీలు అన్న క్యాంటీన్‌లో ఆహారం పొందుతున్నారు. అలాంటి ఆహార కేంద్రానికి అతి దగ్గరలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తే పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



**అవసరమా? లేక కాసుల కక్కుర్తియా? :**

ఇప్పటికే రెండు సులభ కాంప్లెక్స్‌లు అందుబాటులో ఉన్న ప్రాంతంలో మళ్లీ మూడోసారి టాయిలెట్స్ నిర్మించాలన్న ఆలోచన వెనుక ప్రజా అవసరం కంటే అధికారుల కాసుల కక్కుర్తే ప్రధాన కారణంగా కనిపిస్తుందని..? పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత లేకుండా, ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా తీసుకుంటున్న ఈ తరహా నిర్ణయాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ చేపట్టిన నిర్మాణం వెంటనే ఆపివేయాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తూన్నారు.

**స్థానికుల డిమాండ్ ఇదే...:**

ఈ మొత్తం వ్యవహారం హిందూ మనోభావాలకు తీవ్ర భంగం కలిగించేలా ఉందని, వెంటనే ఈ పింక్ టాయిలెట్స్ నిర్మాణాన్ని నిలిపివేసి, ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ వివాదాస్పద నిర్ణయంపై మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

శివాలయం సమీపంలో టాయిలెట్స్ ప్రతిపాదనపై అభ్యంతరాలు

తాడేపల్లిగూడెం తాలూకా ఆఫీస్ సెంటర్ పరిధిలో శివాలయం సమీపంలో పింక్ టాయిలెట్స్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు చేసిన ప్రతిపాదనపై భక్తులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సులభ కాంప్లెక్స్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ, మరో నిర్మాణం అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేకంగా మహా శివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంలో, పవిత్ర ఆలయానికి అతి దగ్గరలో ఈ ప్రతిపాదన రావడం హిందూ భక్తుల భావోద్వేగాలను ప్రభావితం చేస్తోందని వారు పేర్కొంటున్నారు. అలాగే అన్న క్యాంటీన్ సమీపంలో ఉండడం వల్ల పరిశుభ్రత, ఆరోగ్యపరమైన అంశాలపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్ణయం తీసుకునే ముందు ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరిగాయా? అనే అంశంపై స్పష్టత లేదని స్థానికులు అంటున్నారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ ప్రాంతాన్ని పరిశీలించాలని వారు మున్సిపాలిటీని కోరుతున్నారు.

**కొసమెరుపు ఏంటంటే...అభివృద్ధి పేరుతో ధర్మాన్ని, ఆరోగ్యాన్ని, ప్రజాభిప్రాయాన్ని తాకట్టు పెట్టే నిర్ణయాలు తాడేపల్లిగూడెంలో కొనసాగుతాయా? లేదా నేనే రాజు నేనే మంత్రి అన్నట్టుగామున్సిపల్ కమీషనర్ ఉంటుందా..? లేదా ప్రజా ఆగ్రహానికి గురి అవుతారా అన్నది వేచి చూడాల్సిందే...**

# ఎడిటర్ వ్యూ

## అహింసా వాది సరిహద్దు గాంధీ

మహాత్మా గాంధీజీ లాగే ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ అహింసా వాది. జాతిపిత గాంధీ అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు. అందుకే ఆయన సరిహద్దు గాంధీగా పేరెన్నిక గన్నాడు. ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్.... ఈ పేరును ఈ తరానికి చెందిన చాలా మంది విని ఉండక పోవచ్చు. కాని సరిహద్దు గాంధీ అంటే కొంత మందికి అయినా గుర్తుకు రావచ్చు. పాకిస్థాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో ఒక పఠాన్‌గా జన్మించాడు. "ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన పఠాన్ ప్రమాద కరమైన వ్యక్తి" అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. "నేను ఎట్టి పరిస్థితుల్లో అహింసా మార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను" అన్న ప్రతిజ్ఞతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతి కాముకుడు సరిహద్దు గాంధీ. "బాద్షా ఖాన్" గా కూడా సరిహద్దు గాంధీ పేరుగాంచాడు. స్వాతంత్ర్య సమర యోధుడు, గాంధేయవాది. భారతరత్న పురస్కారాన్ని పొందిన తొలి భారతీయేతరుడు. "ఎర్రచొక్కాల ఉద్యమం" ప్రారంభించిన ప్రముఖుడు. ఆయన అనుచరులను "ఖుదాయీ ఖిద్మత్‌గార్" (భగవత్సేవకులు) అని పిలిచేవారు. అయన పష్తో లేదా పక్తూనిస్తాన్ కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ భారత దేశంలో బ్రిటీష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య యోధుడు. 'బచా ఖాన్' గా ప్రసిద్ధి చెందిన అయన మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు, మిత్రుడు, ఆయన భారత దేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్లో బచా ఖాన్ గా సుపరిచితులు. జనవరి 30, 1948 న మహాత్మా గాంధీ హత్యకు 40 సంవత్సరాల తరువాత జనవరి 20, 1988 న మరణించాడు. ఇస్లాం యొక్క గొప్ప అహింసా సైనికుడు. వేలాది అహింసా పఠాన్‌ల విధేయతను పొందిన గొప్ప జాతీయవాద నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న నాటి అవిభక్త భారత దేశంలోని, నేటి పాకిస్తాన్లో ఉన్న వాయువ్య సరిహద్దు నగరమైన ఉత్మాన్జైలో జన్మించాడు. 1910 లో, 20 సంవత్సరాల వయస్సులో, బెచే ఉత్మాన్జై లోని ఒక మసీదులో ఒక పాఠశాలను స్థాపించాడు. 1921 లో 'అంజుమాన్-ఇ ఇస్లా-ఇ ఆఫ్ఘనియా' (ఆఫ్ఘన్ రిఫార్మ్ సొసైటీ), అలాగే 1927 లో యువత ఉద్యమమైన 'పాక్తున్ జిర్గా' స్థాపించాడు. మే 1928 లో, బచా ఖాన్ తీర్థయాత్ర నుండి మక్కాకు తిరిగి వచ్చిన తరువాత, పాష్టో భాషలో నెలవారీ రాజకీయ పత్రిక 'పాక్తున్' (పాష్తున్) ను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం ఖాన్, ఐక్య, లౌకిక, స్వతంత్ర దేశం లక్ష్యాన్ని సాధించగల ఏకైక స్థిరమైన మార్గం... గాంధీ 'సత్యాగ్రహం' సూత్రాలను గట్టిగా అవలంబించడం ద్వారా మాత్రమే, అని నిర్ధారణకు వచ్చాడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది. ఆయన 1920 లలో 'ఖుదై ఖిద్మత్గర్' (దేవుని సేవకులు) ను స్థాపించాడు. 1928 లో ఖాన్ మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీని కలుసు కున్నాడు. భారత కాంగ్రెస్ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు. అతి త్వరలో ఆయన గాంధీకి అత్యంత సన్నిహితుడు అయ్యాడు. స్వతంత్ర, అవిభక్త, లౌకిక... హిందువులు, ముస్లింలు కలిసి శాంతితో జీవించే భారతదేశం గురించి కలలు కన్నాడు. 1931 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వరించినా, "నేను ఒక సాధారణ సైనికుడిని, ఖుదై ఖిద్మత్గర్... అల్లా సేవకునిగా మాత్రమే నేను సేవ చేయాలను కుంటున్నాను" అని చెప్పి సున్నితంగా తిరస్కరించాడు. అయన చాలాకాలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా మాత్రం ఉన్నాడు. భారత భూభాగంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడు తుండగా, అప్పటి వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ అని పిలువబడే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్లో భాగమైన ఆ దేశంలోని వాయువ్య ప్రాంతంలో లక్ష మందిని తుపాకులు వాడడానికి, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా అహింసాత్మకంగా పోరాడడానికి ప్రతిజ్ఞ చేయడానికి ఒప్పించాడు. ఆ సైన్యాన్ని అల్లాహ్ సేవకులు ఖుదై ఖిద్మత్గర్ అని పిలిచాడు. లక్ష మంది ముస్లింలు అయన "ఖుదై ఖిద్మత్గర్" లేదా "అల్లాహ్ యొక్క సేవకులు" ఉద్యమంలో చేరారు. మహాత్మా గాంధీ తత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఖాన్ వారికి వివరించి ఒప్పించాడు. బ్రిటీష్ పాలన ముగిసిన తరువాత భారత దేశాన్ని విభజించ కూడదని డిమాండ్ చేయడం ద్వారా, ఖాన్ ముస్లింలలో చాలా మందికి శత్రువుగా మారాడు. తన ప్రజల హక్కుల కోసం నిరంతరం ఆయుధాలు ఎత్తకుండా కష్టపడ్డాడు. గాంధీ మాదిరిగానే, గఫర్ ఖాన్ తన ప్రజల అభ్యున్నతి స్వాతంత్ర్య సాధన ద్వారానే సాధ్య మని నిజాయితీగా నమ్మాడు. ఖాన్ ప్రావిన్స్ లో పాఠశాలలను తెరిచాడు. మహిళలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావడానికి కృషి చేశాడు. తన అహింసా సైనికులను రోజుకు కనీసం రెండు గంటల సామాజిక పని చేయమని ప్రోత్సహించాడు. భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన భారత రాజకీయ నాయకులతో కలసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. భారతదేశ రాజకీయ నాయకులతో మరీ ముఖ్యంగా గాంధీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీతో కలసి పోరాటం సలిపాడు. సరిహద్దు ప్రాంతపు ముస్లిం లీడర్లు, ఆయన ముస్లింల ద్రోహి అని 1946 లో హత్యా ప్రయత్నం చేసారు. మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్ చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశాడు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సమావేశంలో గఫర్ ఖాన్‌తో పాటు మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌లు పాల్గొనలేదు.

'మీకు అండగా నిలబడ్డాం. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. సరిహద్దు ప్రాంత వాసులకు ద్వేషిగా మారాడు. దేశ విభజన ఆగలేదు. అబ్దుల్ గఫార్ ఖాన్ పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. బాద్షా ఖాన్, అనుయాయులు, భారత పాకిస్తాన్ నాయకులు తీవ్రంగా ద్రోహం చేశారని భావించారు. కాంగ్రెస్ పార్టీని, భారత రాజకీయ నాయకులను ఉద్దేశించి బాద్షాహ్ ఖాన్ అన్న ఆఖరి మాటలు, "మీరు మమ్మల్ని తోడేళ్ళ ముందు విసిరేసారు". అల్లర్లు, హింసతో ఏమీ సాధించలేమని, శాంతి, సౌభ్రాతృత్వాలతో సంపాదించింది శాశ్వతంగా మిగిలి పోతుందని పిలుపు నిచ్చాడు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటు పాకిస్థాన్‌లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్ఘానిస్థాన్‌లోని కాబూల్ నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపాడు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫర్ ఖాన్ భారత్‌కు వచ్చాడు. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చి అంతర్జాతీయ అవగాహన కింద ఇచ్చే 'జవహర్ లాల్ నెహ్రూ అవార్డు' అందుకున్నాడు. పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ 'మీరు బుద్ధుడిని మరచి పోయినట్లు గానే గాంధీని మరచి పోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి జీవించిన గఫర్ ఖాన్ పాకిస్థాన్‌లోని పెషావర్‌లో 1988, జనవరి 20వ తేదీన ఆయన మరణించారు.

## తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, ఇందులో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదని ఆయన గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, భగవంతుడి ముందు వారు మోకరిల్లే వరకు తమ యుద్ధం ఆగదని హెచ్చరించారు. నెయ్యి పేరుతో పామాయిల్, ప్రమాదకరమైన రసాయనాలు వాడి భక్తుల మనోభావాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై మాట్లాడేటప్పుడు తాము అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడారు. పవన్ కల్యాణ్ తన ఆరోపణలకు సంబంధించిన గణాంకాలను కూడా మీడియా ముందుంచారు. "తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఓ నిర్దిష్ట కంపెనీ 59.70 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసినట్లు అధికారికంగా లెక్కలు చూపింది. కానీ, మా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, అదే కంపెనీ 58 లక్షల కిలోలకు పైగా పామాయిల్, దానికి సంబంధించిన ప్లాంట్ బేస్డ్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అంతేకాకుండా, సుమారు 1.70 లక్షల నుంచి 2 లక్షల కిలోల వరకు రసాయనాలను కూడా కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డ్ ఆధారాలున్నాయి. నెయ్యి సరఫరా చేస్తున్నామని చెప్పి, పామాయిల్, రసాయనాలు కొనుగోలు చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఇది కల్తీ నెయ్యి కాదు, కల్తీ వనస్పతి, కల్తీ పామాయిల్" అని పవన్ వివరించారు. ఈ కుంభకోణం కేవలం తిరుమలతోనే ఆగిపోలేదని, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కూడా ఇక్కడి నుంచి పంపిన లక్ష లడ్డూలు సైతం ఈ కల్తీ నెయ్యితో తయారు చేసినవేనని పవన్ ఆరోపించారు. దేశమంతా ఎంతో పవిత్రంగా జరుపుకున్న కార్యక్రమానికి సైతం కల్తీ లడ్డూలు పంపి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వానికి దేవుడిపై, హిందూ సంప్రదాయాలపై పగ ఉందని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని పవన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "వీరికి ఏడుకొండల స్వామిపై ఎందుకో పగ. ఏడు కొండలు ఎందుకు, రెండు చాలు అన్న చరిత్ర వీరిది. వీరు వ్యక్తులపై, ప్రత్యర్థులపై కాదు, ఏకంగా భగవంతుడిపైనే పగబట్టారు. ఈ కుట్ర వెనుక ఉన్న వారి వారసత్వం, వారి పరంపర ఎలాంటిదో ప్రజలు గమనించాలి. అందుకే ఈ అంశాన్ని సరిదిద్ది, వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. "గత ఐదేళ్లలో, అంటే 2019 నుంచి 2024 వరకు, రాష్ట్రంలో వైసీపీ పాలనలో హిందూ ధర్మానికి, దేవాలయాలకు తీరని అపచారాలు జరిగాయి. ఇవి చాలా సున్నితమైన అంశాలు. మత విశ్వాసాలతో ముడిపడి ఉన్న విషయాలపై ఆనాటి ప్రభుత్వ పెద్దలు చూపిన నిర్లక్ష్యం, వారి బాధ్యతారాహిత్యం ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఉదాహరణకు, రామతీర్థంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రమూర్తి విగ్రహ శిరచ్ఛేదనం జరిగితే, దాన్ని ఎవరో ఆకతాయి చేసిన పనిగా తేల్చేశారు. పిఠాపురంలో దేవతా విగ్రహాలకు అశుద్ధం పూస్తే, దానిని ఎవరో పిచ్చోడి చర్యగా చిత్రీకరించి చేతులు దులుపుకున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో వెండి సింహాలు మాయమైతే, 'అవి పోతే ఇంకొకటి కొంటాం, వాటితో ఏమైనా మేడలు, మిద్దెలు కడతామా?' అని అప్పటి మంత్రులు ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడారో ప్రజలు మర్చిపోలేదు. ఇక అంతర్వేదిలో పవిత్రమైన రథం కాలిపోతే, దాన్ని మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనిగా తేల్చేసి కేసును పక్కన పెట్టేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినా, ఆనాటి ప్రభుత్వంలో ఒక్కరు కూడా బాధ్యతగా మాట్లాడటం గానీ, కఠిన చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇలాంటి పాత విషయాలపై ఆరోపణలు, విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాల్సిన అవసరం మాకేముంటుంది? మా దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఈ విషయాలను ప్రస్తావిస్తున్నాం. జరిగిన వాస్తవాలు మాకు తెలిసి కూడా ప్రజలకు చెప్పకపోతే, భవిష్యత్తులో వారే మమ్మల్ని నిలదీస్తారు, 'మీకు తెలిసినా ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని అడుగుతారు. అందుకే బయటకు వచ్చి మాట్లాడుతున్నాం.

గత ఐదేళ్లలో హైందవ సంస్కృతి, మన ధర్మంపై వైసీపీ ప్రభుత్వం తరచుగా దాడులకు, అపవిత్ర కార్యాలకు తెగబడింది. అందుకే దీనిపై మాట్లాడాల్సిన, ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం జరిగిన తప్పులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, ఎదురు మాపైనే విమర్శలు చేస్తున్నారు. ఒకటే విషయాన్ని స్పష్టంగా చెప్తున్నాను... భగవంతుడి మీద పగ పెట్టుకున్నవాడు ఎవడైనా సరే సర్వనాశనం అయిపోతాడు. చరిత్రలో అలా బతికి బట్ట కట్టిన దాఖలాలు కూడా లేవు. ఈ విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి" అని పవన్ తీవ్ర హెచ్చరికలు చేశారు.

## వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు మేమే చెల్లిస్తాం

రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యతను నీటి వినియోగదారుల సంఘాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ లేకుండా చూస్తామని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించే బాధ్యత తమదేనని ఆయన కీలక హామీ ఇచ్చారు. గురువారం అమరావతిలో నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నీటి భద్రత అందరికీ అవసరం కానీ, దాని సంరక్షణపై చాలా మందికి శ్రద్ధ లేదు. పరుగెత్తే నీటిని నిలపాలి, నడిచే నీటిని జలాశయంగా మార్చాలి. అప్పుడే భూగర్భ జలాల మట్టం పెరుగుతుంది" అని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 40 జీవనదుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే కరవు అనే మాటే వినిపించదని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రాన్ని, ఇప్పుడు రైతులకు అనుకూలమైన రాష్ట్రంగా మారుస్తున్నామని తెలిపారు. సాగునీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగిస్తున్నందున, చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాల్సిన బాధ్యత వాటిపైనే ఉందని సీఎం దిశానిర్దేశం చేశారు. నీటి పన్నులు వసూలు చేసుకుని, ఆ నిధులతో కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చని సూచించారు. రాష్ట్రంలో 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సరైన సమయంలో నీరందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇస్తూ, భూగర్భ జలాల పెంపు, కాలువలు, ప్రాజెక్టుల నిర్వహణలో సంఘాలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిరసనల మధ్య... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం...

# విపక్షాల వాకౌట్

పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డంకి కలిగించి, చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సభ నుంచి వాకౌట్ చేశారు. మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే తన ఆత్మకథలో రాసిన కొన్ని కీలక అంశాలపై లోక్‌సభలో చర్చకు అనుమతించకపోవడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 2020లో చైనాతో సరిహద్దు ఘర్షణల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదని నరవణే పేర్కొన్నారని, ఆ భాగాలను చదివి వినిపించేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై గత మూడు రోజులుగా లోక్‌సభ దద్దరిల్లుతోంది. బుధవారం లోక్‌సభలో మహిళా ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభ వాయిదా పడి, ప్రధాని ప్రసంగం నిలిచిపోయింది.

ఇవాళ రాజ్యసభలోనూ విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో విపక్షాల నినాదాలు, అల్లరి మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వికసిత భారత్' నిర్మాణంలో దేశం సరైన దిశలో వేగంగా పయనిస్తోందని అన్నారు. "గత కొన్ని సంవత్సరాలు దేశ వేగవంతమైన అభివృద్ధికి సాక్ష్యంగా నిలిచాయి. ప్రతి రంగంలోనూ ఇది మార్పుల యుగం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్యంలోకి వెళుతుంటే, యువశక్తితో ఉరకలేస్తున్న భారత్ ప్రపంచానికి కొత్త ఆశను అందిస్తోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు.

అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందని, ఇటీవలే 9 కీలక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌తో వ్యాపారం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు విపక్ష సభ్యులు 'విపక్ష నేతను మాట్లాడనివ్వండి', 'నియంతృత్వం నశించాలి' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సరదాగా వ్యాఖ్యలు చేశారు. "ఖర్గే జీ వయసు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని ఆయన కూర్చునే నినాదాలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి" అని ప్యానెల్ స్పీకర్ ను కోరుతున్నట్లు చమత్కరించారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి నిష్క్రమించాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రభుత్వం కాలరాస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా, అభివృద్ధి అజెండానే తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

## బొగ్గు గనిలో పేలుడు... 16 మంది మృత్యువాత

- మొదటి పేజి తరువాయి

ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన

భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన ఉంటుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రెండు దేశాల మధ్య జరిగిన అతిపెద్ద ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఇది మొదటి అంకమని ఆయన అన్నారు. రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన వెలువడుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని పీయూష్ గోయల్ అన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించి మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందని వెల్లడించారు. ఉమ్మడి ప్రకటన వెలువడిన అనంతరం, భారతదేశంపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ అమెరికా ఒక కార్యనిర్వాహక ఉత్తర్వును విడుదల చేస్తుంది.

మూడు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడడం తెలిసిందే. అనంతరం ట్రంప్ "భారతదేశానికి చెందిన ఉత్పత్తులపై ఇక నుంచి అమెరికాలో 18 శాతం సుంకాలు మాత్రమే ఉంటాయి" అని పోస్టు చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపినట్టు ప్రకటించారు.

## పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో భారత్ 'వాయు' గర్జన

భారత వాయుసేనద తన సైనిక శక్తిని, వ్యూహాత్మక సంసిద్ధతను ప్రదర్శించేందుకు సిద్ధమైంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఫిబ్రవరి 27న 'వాయు శక్తి 2026' పేరిట భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించనుంది. గతంలో సరిహద్దు దాటి ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన 'ఆపరేషన్ సిందూర్' తరహాలో ఈ విన్యాసాలను రూపొందించారు. ఈ ప్రదర్శన ద్వారా భారత వాయు శక్తి సామర్థ్యాలు మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించనున్నాయి. ఈ విన్యాసాల్లో వందకు పైగా విమానాలు పాల్గొననున్నాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. రఫేల్, సుఖోయ్-30, తేజస్, మిగ్-29, జాగ్వార్, మిరాజ్-2000, హాక్ వంటి యుద్ధ విమానాలు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించనున్నాయి. వీటితో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ప్రచండ్ అటాక్ హెలికాప్టర్ కూడా రాకెట్లను ప్రయోగిస్తుంది. వాయుసేన నుంచి వైదొలిగిన మిగ్-21 విమానం ఈ తరహా విన్యాసాల్లో కనిపించకపోవడం ఇదే తొలిసారి. ఒక కృత్రిమ యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఏసీసీఎస్) ద్వారా ఈ మొత్తం విన్యాసాలను పర్యవేక్షించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ విమానాలు, క్షిపణుల గమనాన్ని గుర్తించింది ఈ వ్యవస్థే. ఈ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సి-295 రవాణా విమానం మొదటిసారిగా రాత్రిపూట అసాల్ట్ ల్యాండింగ్ డ్రిల్ నిర్వహించనుంది. సి-130జె సూపర్ హెర్క్యులస్ విమానం చిన్న రన్‌వేపై ల్యాండ్ అయి, గరుడ్ కమాండోలను దించి, వెంటనే టేకాఫ్ అవుతుంది.

ఈ విన్యాసాల గురించి పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం అందించినట్లు, 'నోటీస్ టు ఎయిర్‌మెన్' జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలువురు వీఐపీలతో పాటు, ఢిల్లీలోని సుమారు 40 మిత్రదేశాల రాయబార కార్యాలయాల అధికారులు కూడా హాజరుకానున్నారు.

## తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలను వైసీపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, సీబీఐ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని వారు తెలిపారు. ఉండవల్లిలో కూటమి నేతలు చేసిన విమర్శలకు కౌంటర్‌గా గురువారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారంటూ వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, అందులో నిజం లేదని తేల్చిందని వైసీపీ నేతలు గుర్తుచేశారు. ఆ తర్వాత సీబీఐ కూడా అదే నిర్ధారణకు వచ్చిందని పేర్కొన్నారు. అయినా, కూటమి ప్రభుత్వం కావాలనే విషప్రచారం చేస్తూ, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వారు ఆరోపించారు.

**ఏ ప్రమాణానికైనా సిద్ధం: వైవీ సుబ్బారెడ్డి**

టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని, ఎలాంటి పరీక్షకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. "నేను టీటీడీ ఛైర్మన్‌గా ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే పనులు చేయలేదు. స్వామివారి సాక్షిగా ఏ ప్రమాణం చేయడానికైనా నేను రెడీ. అవసరమైతే దేవుడి ముందు సత్యశోధన (పాలిగ్రాఫ్) పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నాను" అని ఆయన స్పష్టం చేశారు. నెయ్యి సరఫరాను పెంచేందుకే నిబంధనలు సవరించామని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని వివరించారు. వివాదాస్పదమైన 'బోలె బాబా' కంపెనీ సరఫరా నిబంధనల సవరణకు ముందే జరిగిందని, అది కూడా టీడీపీ హయాంలోనే మొదలైందని గుర్తుచేశారు. తనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న చిన్న అప్పన్న తన పీఏ కాదని, కేవలం ఏపీ భవన్‌లో లైజన్ ఆఫీసర్ మాత్రమేనని ఆయన తేల్చిచెప్పారు.

**దేవుడిని రాజకీయాలకు వాడుకుంటున్నారు: మిథున్ రెడ్డి**

వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం పవిత్రమైన వెంకటేశ్వర స్వామిని కూడా వాడుకుంటున్నారని, ఇది ఘోరమైన తప్పని విమర్శించారు. "సిట్ నివేదిక చంద్రబాబు ఆరోపణలు అబద్ధమని తేల్చింది. దాన్ని జీర్ణించుకోలేక ఇప్పుడు మళ్లీ కొత్త కమిటీలు వేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి గారు వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడు. అలాంటి వ్యక్తిపై ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయడం దుర్మార్గం" అని మిథున్ రెడ్డి అన్నారు.

**వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ కుట్ర: గురుమూర్తి**

తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ.. సీబీఐ, సిట్ నివేదికలు టీడీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని, అందుకే ఆ నివేదికలను పక్కనపెట్టి మళ్లీ కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. "ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గత జనవరి నుంచి టీటీడీ ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు" అని ఆరోపించారు.

తమ ప్రభుత్వ హయాంలో ఆరోపణలు రాగానే 'బోలె బాబా' కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామని, కానీ ఇప్పుడు కావాలనే పాత విషయాలను తవ్వి తీస్తున్నారని విమర్శించారు. దేవుడితో రాజకీయాలు చేసేవారికి తగిన శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. దర్యాప్తు సంస్థల నివేదికలను గౌరవించి, అసత్య ప్రచారాలను వెంటనే ఆపాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# కేంద్ర పథకాల పురోగతిపై అధికారుల పనితీరు సమీక్ష




**20 పాయింట్ల కార్యక్రమంపై కలెక్టర్ అధ్యక్షతన కీలక సమావేశం**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 05 :** కేంద్ర ప్రాయోజిత పథకాలు, 20 పాయింట్ల కార్యక్రమం అమలు పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని ఫిబ్రవరి 6న మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మంది రంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి 20 పాయింట్ల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ హాజరై వివిధ శాఖల పనితీరుపై సమ గ్రంగా సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొ న్నారు. ఆరోగ్యం, విద్య, తాగునీరు, మౌలిక వసతులు, ఇంధన రంగాలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు స్థితిగతులను ఈ సమావేశంలో విశ్లేషించనున్నారు. ఆరోగ్యం, విద్య శాఖల ప్రత్యేక పథకాలు, అమృత్ పథకం, జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన, పీఎం కుసుమ్ పథకాల అమలుపై శాఖల వారీగా చర్చ జరగనుందని తెలిపారు.

సంబంధిత శాఖల జిల్లా అధికారులు, విభాగాధి పతులు తమ శాఖలకు సంబంధించిన తాజా నివేదికలు, వివరాలతో సమావేశానికి సిద్ధంగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# భూ వివాద కేసులను పరిష్కరించాలి

**రెవెన్యూ మరియు పోలీస్ అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలి రెవిన్యూ సదస్సు లో జిల్లా కలెక్టర్**






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం. ఫిబ్రవరి 05 :** భూ సమస్యల కేసులను త్వరితగతిన పరిష్కారం చెయ్యాలని జిల్లా కలక్టర్ అధికారులని ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లాలో గల ఆర్డీవోలు,ఎమ్మార్వోలు, పోలీస్ అధికారులతో రెవెన్యూ సదస్సు సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లాలో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన పవర్ ప్రజెంటేషన్ ద్వారా అందించిన వివరాలు పై కలెక్టర్ స్పందిస్తూ రెవిన్యూ మరియు పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ వారిగా భూ వివాద కేసుల వివరాలు తెలుసుకుని ఎక్కడ ఎటువంటి అధికార దుర్వినియోగం జరగరాదని అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తప్పుడు కేసులకు అండదండలు అందించిన వారికి భయం కలిగేలా బైండ్ ఓవర్ కేసుల్లో పూచికత్తుగా ఉన్న మొత్తాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించకూడదని తప్పు చేయాలనే ఉద్దేశం ఉన్నవారికి కేసుల భయం మరియు ఆర్థిక భారం దృష్టికి వచ్చేలా అధికారులు కఠినంగా వ్యవహరించాలని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 292 కేసులు జనవరికి ముందు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గతంలో పోలీసు యంత్రాంగం కంటే రెవెన్యూ యంత్రాంగం దగ్గరే ఇటువంటి కేసులు వివరాలు ఉండేవని, అప్పట్లో నాయుడు కరణం మరియు తలయారి గ్రామాల్లో వివరాల సేకరణలో ముందంజలో ఉండేవారని, ఇప్పటికీ రిటైర్ అయి గ్రామాల్లో ఉన్న నాయుడు, కారణం తదితర వాళ్ల సహాయంతో రెవెన్యూ వ్యవస్థలో మార్పు తీసుకురావాలని అన్నారు. తహసిల్దార్లు, వీఆర్వోలు వివరాల సేకరణలో పోలీసు అధికారులకు తగు సమాచారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, డిఆర్ఓ ఎస్ వి లక్ష్మణమూర్తి, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, పలాస ఆర్డిఓ వెంకటేశ్వరరావు, టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి, ఎమ్మార్వోలు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్మశానమే పార్కింగ్ యార్డా?





**అల్యూఫ్లోరైడ్ కార్పొరేట్ అహంకారానికి హద్దుల్లేవు!**
**పరిశ్రమ కాలుష్యంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**
**అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం**

**ములగాడ , పెన్ పవర్, ఫిబ్రవరి 05 :** జీవీఎంసీ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతం 58 వ వార్డు ములగాడ గ్రామం ఆనుకొని కొన్ని సంవత్సరాలుగా అల్యూఫ్లోరైడ్ లిమిటెడ్ అనే కార్పొరేట్ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఈ కంపెనీకి ఆనుకొని పూర్వకాలం నుంచి ఉన్న ములగాడ గ్రామ స్మశానం సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో ఉంది. అయితే కంపెనీ యాజమా న్యం తమకు సంబంధించిన అంగుళం స్థలం కూడా వదలకుండా చుట్టూ ప్రహరీ నిర్మించుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పటికీ, కంపెనీకి వచ్చే వాహనాలన్నింటినీ గ్రామ స్మశానంలోనే నిర్లక్ష్యంగా పార్కింగ్ చేస్తోంది. ఈ అంశంపై స్థానిక ప్రజలు, గ్రామ సంఘాలు పలుమార్లు యాజ మాన్యానికి తెలియజేసినా "దున్నపోతు మీద వాన పడినా పట్టించుకోని" ధోరణితో యాజమాన్యం వ్యవహరిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపెనీ తీరు మరింత దారుణంగా ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్మశానాన్ని అవమానించడమే కాకుండా, ప్రజలకు మరియు పర్యావరణానికి హానికరమైన వ్యర్థాలు, కాలు ష్య పొగలను "ఉచితంగా అందిస్తాం" అన్నట్లు గా కంపెనీ వ్యవహరిస్తోందని గ్రామస్తులు మండిపడుతున్నారు.

ఈ కాలుష్యం కారణంగా భూములు పాడవు తున్నాయని, భూసంపదలు నశిస్తున్నాయని, పరిసర గ్రామాలలో నీరు కూడా కలుషితమైం దని ఆరోపిస్తున్నారు.

కాలుష్య ప్రభావంతో పిల్లలు, వయోవృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంత జరుగుతున్నా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఈ కార్పొరేట్ సంస్థపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

"అధికారులు ఈ కంపెనీ వైపు ఎప్పుడైనా తలెత్తి చూసారా?" అంటూ గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్మశానానికి రక్షణ కల్పించాలని, కాలుష్యానికి చెక్ పెట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





**అభివృద్ధి దిశగా 76వ వార్డు**

పలు అభివృద్ధి పనులు కు శంకు స్థాపన

-4లో

# వరుస రాత్రి దొంగతనాల కేసుల్లో నిందితుడికి 18 నెలల జైలు శిక్ష

**దర్యాప్తు బృందం, ఏపీపీని అభినందించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**



**అనకాపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 5 :** స్థానిక అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019 సంవత్సరంలో జరిగిన వరుస రాత్రి దొంగతనాల కేసుల్లో ప్రధాన నిందితుడికి గౌరవ న్యాయస్థానం 18 నెలల జైలు శిక్ష విధించింది. శాస్త్రీయ ఆధారాలతో పక్కా దర్యాప్తు నిర్వహించి నేరాన్ని రుజువు చేసిన పోలీసు అధికారులు, అలాగే సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రాసిక్యూషన్ బృందాన్ని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. అనకాపల్లి రూరల్ పరిధిలోని కొండకొప్పాక, ఎల్.ఆర్.ఎం కాలనీ, సిరసపల్లి, మారేడుపూడి తదితర ప్రాంతాలలో 2019లో వరుసగా రాత్రివేళ దొంగతనాలు చోటు చేసుకున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని నగదు, బంగారు ఆభరణాలను అపహరించిన ఘటనలపై అనకాపల్లి రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. క్రైమ్. నెం. 254, 279, 321/2019

ఉక్కినగరంలో బాధితుడు శుభకార్యానికి వెళ్లిన సమయంలో ఇంట్లోకి చొరబడి 13.5 తులాల బంగారాన్ని చోరీ చేసిన ఘటనతో పాటు, ఎల్.ఆర్.ఎం కాలనీలో కిటికీ గ్రిల్స్ విరగ్గొట్టి 3 తులాల బంగారాన్ని అపహరించిన కేసు క్రైమ్ నెం.288/2019 కూడా ఈ వరుస దొంగతనాల్లో భాగంగా నమోదయ్యాయి.

ఈ కేసులపై విచారణ చేపట్టిన అనకాపల్లి 11వ అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ గౌరవ న్యాయమూర్తి ఏ.రమేష్ తుది తీర్పును వెల్లడించారు. ప్రధాన నిందితుడు తాటిపూడి శంకర్ (ఆటో డ్రైవర్, అగనంపూడి) పాత నేరస్తుడు (హ్యాబిచ్యువల్ అఫెండర్) కావడంతో, అతనిపై మోపబడిన అభియోగాలు రుజువైనట్లు కోర్టు నిర్ధారించింది. దీంతో నిందితుడికి ఒక సంవత్సరం ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. ఈ కేసుల్లో మరో నిందితుడు (ఏ-2) విచారణ సమయంలో మరణించగా, సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా ఏ-3ను కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. నిందితులను చాకచక్యంగా పట్టుకుని, చోరీ సొత్తును రికవరీ చేసిన అప్పటి దర్యాప్తు అధికారులు పి.వి.వి. నరసింహారావు, పి. రామకృష్ణారావు, ఏ. వెంకటేశ్వరరావులను జిల్లా ఎస్పీ ప్రశంసించారు. అలాగే కోర్టులో బలమైన సాక్ష్యాధారాలను సమర్పించి, నిందితుడికి శిక్ష పడేలా సమర్థంగా వాదించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృణాళినిని ప్రత్యేకంగా అభినందించారు.

నేరస్తులకు శిక్ష పడటం వల్ల బాధితులకు న్యాయం జరుగుతుందని, ఇది నేరాల నియంత్రణకు తోడ్పడడంతో పాటు పోలీసు వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత బలపరుస్తుందని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ప్రక్రియలో సహకరించిన అనకాపల్లి రూరల్ పోలీసులు మరియు ఇతర సిబ్బందిని కూడా ఆయన అభినందించారు.

# "కేజీబీవీ"లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాససదస్సు నిర్వహణ

**ముఖ్య అతిథి గా నవల రచయిత యండమూరి వీరేంద్రనాథ్**



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 5 :** బుద్ధితో కాకుండా జ్ఞానంతో ఆలోచించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అవరోధిస్తారని ప్రముఖ నవలారచయిత యండమూరి వీరేంద్రనాథ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రాజేంద్రపాలెం కస్తూర్బా పాఠశాల లో నేను సైతం చారిటబుల్ ట్రస్ట్, అల్లూరిజిల్లా పోలీసులు సౌజన్యంతో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యండమూరి వీరేంద్రనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థులు తొందర పడకుండా ఉత్సాహంగా చదువుపై దృష్టి చారించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు చదువుపై ప్రత్యేకత శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం నేను సైతం వ్యవస్థాపకులు శివప్రసాద్ శివప్రసాద్, కొయ్యూరు సీఐ శ్రీనివాస్ లు మాట్లాడుతూ... పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని వారి రోజు వారి నడవడిక పరిశీలించాలన్నారు. అలాగే విద్యార్థులు కూడా కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలన్నారు. అనంతరం డ్రగ్స్ పై వచ్చే అనర్థాలు గురించి విద్యార్థులకు వివరించారు. యండమూరి వీరేంద్రనాథ్ చేతుల మీదుగా యండమూరి వీరేంద్రనాథ్ చేతులు మీదుగా పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ ఎస్సై సిదరి శ్రీనివాస్, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు విద్యార్థునులు పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని చక్కగా జరిగేలా అహర్నిశలు కృషిచేసిన నర్సి కిరణ్ కు యండమూరి వీరేంద్రనాథ్, నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శివప్రసాద్, అల్లూరి జిల్లా పోలీస్ శాఖ వారు అభినందించి అవార్డుని అందించారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, అరసవల్లి, ఫిబ్రవరి 05**: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని గురువారం ఉదయం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వి.ఆర్. కృష్ణతేజ మైలవరపు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కమిషనర్‌కు, ఆలయ వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని వారికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా బార్ లైసెన్సుల కేటాయింపు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. ఫిబ్రవరి 05** : జిల్లాలో బార్ లైసెన్సుల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత తెలిపారు. పార్వతీపురం, సాలూరు పట్టణాలకు చెందిన నాలుగు బార్ల కేటాయింపు ప్రక్రియ జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డీఆర్ఓ సమక్షంలో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఓ డ్రా ద్వారా లాటరీని తీసి బహిరంగంగా దరఖాస్తుదారులకు చూపించారు. ఈ ప్రక్రియలో మొత్తం 20 మంది దరఖాస్తు చేసుకోగా, పార్వతీపురం పట్టణ పరిధిలోని మూడు బార్లను, సాలూరు పట్టణ పరిధిలో ఒక బారుకు డ్రా ద్వారా లైసెన్సులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ. సంతోష్, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

## 11 బార్ లకు లైసెన్సులు మంజూరు లాటరీ తీసి కేటాయించిన జిల్లా కలెక్టర్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. ఫిబ్రవరి 05:**జిల్లాలో మిగిలిపోయిన 11 బార్లకు లైసెన్సులు మంజూరయ్యాయి. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో లాటరీ నిర్వహించి, లైసెన్సులను కేటాయించారు. మొత్తం 11 బార్లకు 62 మంది ధరఖాస్తు చేసుకున్నారు. వీటి ద్వారా ధరఖాస్తు ఫీజు రూపంలో 3.10 కోట్లు రూపాయిలు వసూలు అయ్యింది. లాటరీ ప్రక్రియ నిర్వహించేందుకు మొత్తం 6 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ దగ్గరా ఒక తాహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను నియమించారు. మొదటిగా లైసెన్సు విజేత పేరుతోబాటు, రిజర్వ్ 1, రిజర్వ్ 2 ధరఖాస్తు దార్ల పేర్లను కూడా లాటరీ ద్వారా ఎంపిక చేశారు. రెండు రౌండ్లలో మొత్తం లాటరీ ప్రక్రియ ముగిసింది. ఈ లాటరీ ప్రక్రియలో ఎక్సైజ్ డిప్యుటీ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి, ఎక్సైజ్ కమిషనర్ బి.శ్రీనాధుడు, ఏఈఎస్ ఎ.శ్రీరంగం దొర, ఇతర ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు ఘనంగా ఏర్పాట్లు..ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, చీపురుపల్లి పిబ్రవరి 05 :** చీపురుపల్లి పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలను ఈనెల 22, 23, 24 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావు తెలిపారు. జాతర ఏర్పాట్లపై గురువారం ఆలయ ప్రాంగణంలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కళావెంకటరావు ఆదేశించారు. పోలీస్, దేవాదాయ, పంచాయతీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్ అండ్ బి, ఎక్సైజ్, వైద్య, మరియు నీటిసరఫరా విభాగాల అధికారులతో ఏర్పాట్లపై కూలంకషంగా చర్చించారు. జాతర సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ అంతరాయం లేకుండా చూడటం, తాగునీటి సరఫరా, పారిశుధ్యం మరియు భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కే త్రిమూర్తులు రాజు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు డి.ఎస్.పి రాఘవులు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అభివృద్ధి దిశగా 76వ వార్డు



పలు అభివృద్ధి పనులు కు శంకు స్థాపన

**గాజువాక: పెన్ పవర్, ఫిబ్రవరి 05:**అభివృద్ధి దిశగా 76వ వార్డు ను ముందుకు తీసుకు వెళ్తున్నామని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. వార్డు పరిధి కుమ్మరి వీధి లో కమ్యూనిటీ హాల్ మరమ్మతులకు, గాంధీ నగర్ లో పార్కు ప్రహరీ నిర్మాణ పనులు కు శంకు స్థాపన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో వార్డు ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్తున్నామని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా మౌలిక సదుపాయాలు కల్పన కు కృషిచేస్తున్నామని అన్నారు. కార్య క్రమంలో వార్డు అధ్యక్షుడు జిత్తుక అప్పల రాజు, సెక్రటరీ కూన వెంకట్రావు, శివ, బొడ్డు సత్యారావు, రాము నాయుడు, కుమార్, బొడ్డు కృష్ణ, తెంటు సత్యనారాయణ, బాసంగి తిరుపతి రావు, రమణారావు, రోనంకి నారాయణమూర్తి, చిక్కా సత్యనారాయణ, కల్లూరి సింహాచలం, గొర్లి పాపినాయుడు, భీమరెడ్డి శ్రీనివాసరావు, కృష్ణారావు, బి. రామచంద్రరావు, జి. అన్వేష్, అప్పలనారాయణ, మన్మధరావు, నాయుడు, లక్ష్మీపతి, అబ్రహం,టి. రాంప్రసాద్, శంకరరావు, నారాయణరావు,నాయుడు, వి.రమేష్, ప్రసాద్, వెంకటేష్, ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ -ఆటోలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**పారిశుద్ధ్య కార్మికులు విధులను సక్రంగా నిర్వర్తించాలి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఫిబ్రవరి 05:** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ పంపిణీ చేసిన ఎనిమిది ఎలక్ట్రానిక్ వాహనాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ప్రతీ ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రధానమైన పారిశుభ్రతపై అధికారులు మరియు సిబ్బంది బాధ్యత వహించి పనిచేయాలని ఈ సందర్భంగా కలక్టర్ సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్యను ఏ ఏ మండలాలకు వాహనాలను కేటాయించారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కవిటి మండలం రాజపురం పంచాయతీ, కంచిలి మండలం ఎమ్ .య.స్. పల్లి, ఇచ్ఛాపురం మండలం మసకాపురం, వజ్రపు కొత్తూరు మండలం పల్లిఊరు, మందస మండలం బుడారిసింగి, పలాస మండలం తర్లకోటకు ఒక్కొక్కటి చొప్పున మరియు కోటబొమ్మాలి మండలం నిమ్మాడకు రెండు వాహనాలను కలిపి మొత్తం ఎనిమిది వాహనాలను మంజూరు అయినట్లు కలెక్టరుకు ఆమె వివరించారు. తదుపరి వాహనాల పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అనుభవం ఉన్న డ్రైవర్లుతో పని చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ భారతి సౌజన్య, కార్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహణ

**విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు వార్డుల్లో సేవా**





**విశాఖ దక్షిణ పెన్ పవర్ ఫిబ్రవరి 5:**కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆలోచనలకు అనుగుణంగా కూటమి శ్రేణులు వాడవాడలా పండగ వాతావరణంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కటింగ్‌లు, అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలతో అభిమానులు సందడి చేశారు.

34వ వార్డులో సేవా కార్యక్రమాలు

ఈ సందర్భంగా 34వ వార్డులో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎనిమిది కుటుంబాలకు జీవనోపాధి కోసం ఆరు చెక్క బడ్డీ కొట్టాలు, రెండు తోపుడు బండ్లు అందజేశారు. మరో నాలుగు కుటుంబాలకు ఎనిమిది బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఒక చర్చికి పది కుర్చీలు, ఒక క్రికెట్ జట్టుకు క్రికెట్ సామగ్రిని అందజేశారు. అలాగే 34వ వార్డులో పదిహేను కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. గత పన్నెండు సంవత్సరాలుగా నిరంతరంగా ఆర్థిక సహాయం, అన్నదాన కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు అందిస్తూ ప్రజల మద్దతు పొందుతున్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన వార్డు సీనియర్ నాయకులు, మహిళలు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

శానిటేషన్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందికి పంపిణీ

34వ వార్డులో జనసేన నాయకుల ఆధ్వర్యంలో జీవీఎంసీ ఆర్పీలు, అంగన్వాడీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బందికి పండ్లు, చీరలు పంపిణీ చేశారు. సుమారు 250 మందికి ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరింది. అనంతరం కేక్ కటింగ్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వార్డు ఇంచార్జీలు, వార్డు అధ్యక్షులు, మత్స్యకార నాయకులు, వీర మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

31వ వార్డులో అన్నదాన కార్యక్రమం

ప్రేమ సమాజంలో 31వ వార్డు కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, పండ్ల పంపిణీ, టవల్స్ పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం పండ్లు, టవల్స్ అందజేసి, అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో 31వ వార్డు కూటమి నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

హోటల్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొనడం

ద్వారకానగర్ బుధిల్ పార్క్ రోడ్డులో హోటల్ సంఘం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోటల్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు వివరించారు. పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మరియు సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



## కేజీబీవీ బాలికల పాఠశాల దగ్గర ఏర్పాటు చేస్తున్న స్మశాన వాటిక తక్షణమే వేరే చోటికి మార్చాలి

విద్యార్థి,ప్రజా సంఘాల డిమాండ్




**పాడేరు, పెన్ పవర్, ఫిబ్రవరి: 5:**పాడేరు మండలం లగిసిపల్లి కేజీబీవీ బాలికల పాఠశాలకు అనుకుని కొత్త స్మశాన వాటికకు ఏర్పాటు చేయడం చాలా దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు: వారు మాట్లాడుతూ: ఎన్ హెచ్ 516 ఈ, హైవే రోడ్డు రావడంతో లగిసిపల్లి స్మశాన వాటిక పూర్తిగా లేకుండా పోతుంది. కనుక కేజీబీవీ బాలికల ఆశ్రమ పాఠశాల ఆనుకొని సర్వే నెంబర్ 47, ఐదు ఎకరాలు, మొత్తం 50 సెంట్లు భూమి కొత్త స్మశాన వాటిక ఏర్పాటు కోసం బాలికల స్కూల్ (హాస్టల్) ప్రహరీ గోడ కు ఆనుకొని స్థలం కేటాయించడంతో విద్యార్థినిలు భయబ్రాంతులకు గురికావడం, విద్యార్థులు చదువుకి దూరం అయ్యే ప్రమాదం ఉందని, స్కూలు కనుక్కొని స్మశాన వాటిక ఉండటం వలన అనేక ఇబ్బందులు వస్తాయని వారన్నారు. విద్యార్థులను డ్రాప్ అవుట్స్ సంఖ్య పెరుగుతుందని, వేరే దగ్గర ప్రభుత్వ స్థలాల్లో, స్మశాన వాటిక కేటాయించాలి. ప్రభుత్వ స్థలాలు లేని పక్షంలో అధికారులు, ప్రభుత్వం వేరే చోట భూమి కొనుగోలు చేసి అయినా స్మశాన వాటిక స్థలం కేటాయించాలని అలా కాకుండా బాలికల పాఠశాల కు కానుకొని స్మశాన వాటిక పెట్టడం ఏంటని అధికారులకు సూటిగా ప్రశ్నించారు. అధికారులు తక్షణమే విరమించుకొని వేరే చోటికి మార్చాలి. లేనిపక్షంలో విద్యార్థినిలు విద్యార్థినుల తల్లిదండ్రులతో ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ శ్రీను, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీవన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ ఆసుపత్రిలో త్వరలో పంచకర్మ సేవలు

కమిటీ చైర్‌పర్సన్ చింతకాయల పద్మావతి



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 05) :**నర్సీపట్నం ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రిలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి, ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం మరియు రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం వంటి అంశాలపై కమిటీ సభ్యులు ప్రధానంగా చర్చించారు.

ఈ సందర్భంగా కమిటీ చైర్‌పర్సన్ పద్మావతి మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు, స్పీకర్ సహకారంతో మరిన్ని నిధులు సమకూర్చి, ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, రోగుల వ్యాధులను అనుసరించి వారికి ప్రత్యేకంగా యోగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా యోగాలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి తక్కువ సమయంలో ఉపశమనం కలిగించే పంచకర్మ సేవలను త్వరలోనే ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆసుపత్రిలో పంచకర్మ థియేటర్ ఏర్పాటు ఆవశ్యకతను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్తామని వారు పేర్కొన్నారు.

మహాశివరాత్రికి ఉచిత వైద్య శిబిరం:

ఈ నెల 16వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, బలిఘట్టం శివాలయం ఆవరణలో ప్రజల సౌకర్యార్థం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు.

ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.ఎస్. యశోదా దేవి, కమిటీ సభ్యులు మున్సిపల్ కౌన్సిలర్ ఎన్. సీతా చంద్రిక, పి. దేవానంద్, కె. మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి పారదర్శకతతో బార్ లైసెన్సుల ఎంపిక







- 27 మద్యం బార్లకు లైసెన్సులు
- లాటరీ ప్రక్రియకు నేతృత్వం వహించిన జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 05 :**విశాఖపట్నం డివిజన్ పరిధిలో నోటిఫైడ్ బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించి మద్యం బార్ లైసెన్సుల ఎంపిక ప్రక్రియను సోమవారం పూర్తి స్థాయి పారదర్శకతతో నిర్వహించారు. ఈ లాటరీ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి స్వయంగా పర్యవేక్షించారు.

డివిజన్ పరిధిలో మొత్తం 52 నోటిఫైడ్ బార్లకు గాను 27 బార్లకు దరఖాస్తులు అందగా, వా టిలో మూడు బార్లకు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు. మిగిలిన బార్లకు సింగిల్ అప్లికెంట్లు మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు.బహుళ దరఖాస్తులు వచ్చిన బార్లకు లాటరీ విధానంలో ఎంపిక నిర్వహించడంతో పాటు, ప్రతి బార్‌కు ఆర్1, ఆర్2 రిజర్వ్ అభ్యర్థులను కూడా ఖరారు చేసినట్లు తెలిపారు. లాటరీలో ఎంపి కైన అభ్యర్థులు రూ.18.5 లక్షల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించిన వెంటనే ప్రొవిజనల్ లైసెన్స్ జారీ చేసి, తక్షణమే వ్యాపార కార్యకలాపాలకు అనుమతి ఇస్తామని జేసీ వివరించారు. పూర్తి లైసెన్స్ ఫీజును ఆరు వాయి దాలలో చెల్లించే వెసులుబాటు కల్పించామని, రెండో మరియు మూడో సంవత్సరాల్లో లైసెన్స్ ఫీజుపై ఏటా 10 శాతం చొప్పున పెంపు ఉం టుందని తెలిపారు.లైసెన్స్ పొందిన వారు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, చట్టాలకు కట్టుబడి, నిర్ణీత ప్రాంగణాల్లోనే వ్యాపారం నిర్వ హించాల్సి ఉంటుందన్నారు. మద్యం విక్రయా లు, నిబంధనల అమలుపై ఎక్సైజ్ శాఖ నిశిత పర్యవేక్షణ కొనసాగిస్తుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ఆర్. ప్రసాద్, ఇతర అధికారులు, ఆశావహులు పాల్గొన్నారు.

## గీతం యూనివర్సిటీ భూముల బదలాయింపుపై పూర్తి వివరాలు వెల్లడించాలి

- ప్రజాభిప్రాయం లేకుండా ఆమోదం ప్రజాస్వామ్య విరుద్ధం
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 05 :**ఎండాడరుషికొండ గ్రామాలకు చెందిన ప్రభుత్వ భూములను గీతం యూనివర్సిటీకి బదలాయించేందుకు తీసుకొచ్చిన ప్రతిపాదనపై విశాఖ ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు అన్నారు. ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వా లని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ కి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడు తూ.మొత్తం 54 ఎకరాలు 79 సెంట్ల ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేటు యూనివర్సిటీకి బద లాయించేందుకు ప్రతిపాదన రావడం ఆందోళ నకరమని పేర్కొన్నారు. విశాఖపట్నం రూరల్ తహసీల్దారు ద్వారా జీవీఎంసీ కమిషనర్‌కు భూమి బదలాయింపు ప్రతిపాదన పంపడం జరిగిందని తెలిపారు.జనవరి 30న జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదన ను 15వ అంశంగా అజెండాలో చేర్చి, ఎలాంటి ప్రజాస్వామిక చర్చ లేకుండా, సభ్యుల స్పష్టమై న ఆమోదం లేకుండానే ఏకపక్షంగా ఆమోదించ డం తీవ్రంగా అభ్యంతరకరమని వైసీపీ పేర్కొంది.ఈ భూమి బదలాయింపును విశాఖపట్నం ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున జిల్లా కలెక్టర్‌కు స్పష్టం చేశారు.

మొత్తం భూమిలో

ఎంత మేరకు ప్రభుత్వ భూమి ఉందో,గెడ్డ పోరంబోకు భూమి ఎంత ఉందో, ఎస్. ఐ. ఓ. డి భూమి ఎంత మేరకు ఉందో,భూమి బదలాయిం పు నిర్ణయానికి సంబంధించిన పూర్తి ఫైల్ వివరా లు ఏంటి ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్‌గా ప్రజల ఆస్తిని కాపాడాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తు చేస్తూ, ఈ భూమి బదలాయింపును తక్షణమే నిలిపివేయాలని కోరారు.గీతం యూనివర్సిటీకి భూమి బదలాయింపు అంశంలో ప్రజాభిప్రాయాన్ని గౌరవించి న్యాయమైన నిర్ణయం తీసుకోవా లని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయక ర్తలు మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్, దేవన్ రెడ్డి, శాసన మండలి సభ్యులు కుంభ రవిబాబు, డిప్యూటీ మేయర్ కట్టమురి సతీష్, ఎస్సీసీ సభ్యులు బాణాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పీవీ నారాయణ, కోరుకొండ వెంకట రత్న స్వాతి దాస్, పళ్ళ దుర్గతో పాటు జిల్లా, అనుబంధ విభాగాల నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గెడ్డ వాగు కప్పి... రియల్ రహదారి.





- దేశపాత్రునిపాలెం సర్వే నెంబర్ 228లో రియల్ వ్యాపారుల బరితెగింపు.
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ శాఖ.

**పరవాడ(పెన్ పవర్) ఫిబ్రవరి 5:** ఒకపక్క అధికారులు అనకాపల్లి ఉత్సవ్ భాగంగా బిజీగా ఉన్న సమయంలో రియల్ ఎస్టేట్ అక్రమార్కులు గెడ్డ వాగును కప్పేసారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గడ్డవాగుపై కల్వర్టు నిర్మించి

దర్జాగా రియల్ భూములకు రహదారిగా మలచుకున్నారు. అడ్డుగా ఉన్న పచ్చని చెట్లను సైతం తొలగించి వాల్టా చట్టానికి తూట్లు పొడిచారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇది ఎక్కడో మారు మూలన జరిగిందనుకుంటే పొరపాటే. పరవాడ మండలం జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం రెవెన్యూలోని జాజుల వానపాలెం పి. బోనంగి వెళ్లే రహదారీ అనుకునే ఈ తతంగం జరిగింది. సర్వే నెంబర్ 228కు చెందిన గెడ్డ వాగును కప్పేసి రియల్ భూములకు రహదారిగా మలచుకున్నారు.కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ అక్రమానికి పాల్పడినట్లు బహిరంగ ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో ఇదే గెడ్డ వాగు చాలా వరకూ ఆక్రమణకు గురైంది. గెడ్డను కొంచెం కొంచెం ఆక్రమించి స్థానికులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు అప్పట్లో ఆరోపణలూ వ్యక్తమయ్యాయి. అయితే ప్రస్తుతం మిగిలిన వాగు స్థలంపై కూడా కన్నుపడ్డ ఈ నాయకులు కాస్త దూకుడు పెంచి ఉన్న గెడ్డను మాయం చేసేసారు. అడ్డుగా ఉన్న తాటి చెట్లను కూడా తొలగించి వాల్టా చట్టానికి తూట్లు పొడిచారు. రియల్ వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని ఈ అక్రమానికి పాల్పడినట్లు ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెరువులు, వాగులు, గెడ్డలను ఆక్రమించరాదని,అలాగే అందులో అధికారులు సైతం పట్టాలు ఇవ్వరాదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అవేమీ తమకు పట్టనట్లు ఆ నాయకులు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇక్కడ సెంటు భూమి లక్షల్లో ధర పలుకుతుండటంతో కబ్జాల పర్వానికి తెర లేపారని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.నిత్యం అదే రహదారిలో అధికారులు తిరుగుతూ ఉంటారు. గెడ్డ దర్జాగా కబ్జాకు గురైనప్పటికీ అసలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు కూడా మాకు సంబంధం లేదన్నట్లుగా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీనిపై పలు మార్లు తహసీల్దారు కార్యాలయానికి పిర్యాదులు వెళ్లిన ప్పటికీ చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తుండటం కొసమెరుపు. వాస్తవానికి గెడ్డ వాగు పై కల్వర్టు నిర్మించాలంటే రెవెన్యూ అధికారుల సిఫార్సుతో ఇరిగేషన్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారుల సిఫార్సు లేకుండా రియల్ ఎస్టేట్ భూములకు కలవర్ట్ నిర్మాణాలకు ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇవ్వకూడదు. ఇవేమీ పట్టని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమదైన శైలిలో అధికారులను ప్రసన్నం చేసుకొని గెడ్డ వాగు పై కల్వర్టు నిర్మించి తమ రియల్ ఎస్టేట్ భూములకు రహదారి ఏర్పాటు చేసుకున్నారు.ఇప్పటికైనా రెవెన్యూ, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుని గెడ్డ వాగును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# జిల్లా ఆఫ్-సైట్ ఎమర్జెన్సీ ప్లాన్ తక్షణమే పూర్తి చేయాలి




- పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల కఠిన అమలు
- కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఫిబ్రవరి 05 :**జిల్లాలో అమలులో ఉన్న ఆఫ్–సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌ను అత్యవసరంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత శాఖలు, పరిశ్రమల యాజమాన్యాల కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమ లలో సంభవించే ప్రమాదాలను ముందుగానే నివారించేందుకు పాతబడ్డ, పనికిరాని యం త్రాలు, స్క్రాప్, నిరుపయోగ సామగ్రిని తొలగించి భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం గా అమలు చేయాలని సూచించారు.

గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగ్ హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి క్రైసిస్ గ్రూప్ మేనేజ్మెంట్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 17 నుంచి విశాఖపట్నం లో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమం నేపథ్యంలో జిల్లాలోని అన్ని పరిశ్రమలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించా రు. పరిశ్రమల నుంచి వెలువడే ఉద్గారాలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల కు అనుగుణంగా, అనుమతించిన స్థాయి లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమ లుపై సమీక్ష నిర్వహించగా, వాటి పురోగతిని క్రైసిస్ గ్రూప్ మెంబర్ సెక్రటరీ, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేశ్ వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ భద్రతా విభాగ అధికారులు, ఎన్‌డీ ఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్ డిప్యూటీ కమాండెంట్, అలాగే వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఉమ్మడి విశాఖ జిల్లాల జర్నలిస్టులకు ఫిబ్రవరి 6, 7 తేదీల్లో ఆహ్వానపు క్రికెట్ పోటీలు.





**పరవాడ(పెన్ పవర్): ఫిబ్రవరి 5:** పరవాడ జర్నలిస్టు స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, రాంకీ ఫౌండేషన్ సహకారంతో శుక్ర ,శనివారాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాల జర్నలిస్టులకు ఆహ్వానపు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డా“శ్రీకాంత్ తెలిపారు. ప్రతి సంవత్సరం విశాఖ ఫార్మసిట క్రీడ మైదానంలో జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 6, 7 తేదీల్లో జర్నలిస్టులకు ఆహ్వానపు క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రికెట్ పోటీల్లో పాల్గొనే జట్లకు రాంకీ ఫౌండేషన్ కార్యాలయంలో విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్రావు భక్షి సమక్షంలో డ్రా తీయడం జరిగిందని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలకు చెందిన మొత్తం 8 జట్లు ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. పోటీల్లో విజయం సాధించే జట్లకు ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, వ్యక్తిగత బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులకు అన్ని మూలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్ని ఉద్దేశించి డీజీఎం గిరిధర్రావు భక్షి మాట్లాడుతూ నిత్యం పని ఒత్తుల్లతో సతమతమయ్యే జర్నలిస్టులకు ఈ క్రికెట్ పోటీలు మంచి ఉత్సాహాన్ని ఇస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి జర్నలిస్టులు క్రీడా స్పూర్తిని ప్రదర్శించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సిహెచ్ లోకేష్, ఎండి రాజు, జట్టు కెప్టెన్ శ్రీను, రాధా కృష్ణ, రామ్ కి ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

డాక్టర్ కందుల నాగరాజు



**విశాఖ పెన్ పవర్ ఫిబ్రవరి 5 :**ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు.

విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి డాక్టర్ కందుల నాగరాజు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అలాగే నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కృషి చేస్తున్నారని చెప్పారు.

నియోజకవర్గంలో ప్రతి వార్డు అభివృద్ధి చెందే విధంగా తన వంతు సహకారాన్ని అందజేస్తున్నారని పేర్కొన్నారు.

ముఖ్యంగా తన 32 వ వార్డు అభివృద్ధికి అని ఎంతో కృషి చేశారని కొనియాడారు.

పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఎమ్మెల్యే ముందుకు వెళ్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు.

భవిష్యత్తులో ఆయన మరిన్ని పదవులు చేపట్టి, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

## గాయపడ్డ విలేకరి ను నవలా రచయిత యండమూరి పరామర్శ.

నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కుసిరెడ్డి శివప్రసాద్



**కొయ్యూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 5 :** ఇటీవల కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొయ్యూరు మండల ఆంధ్ర వాయిస్ దినపత్రిక విలేకరి పాలపర్తి సత్యనారాయణ ను ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్, నేను సైతం ట్రస్ట్ ఛైర్మెన్ కె శివప్రసాద్ తదితరులు గురువారం పరామర్శించారు. ఇటీవల రాజమండ్రిలో తన పిల్లలను పాఠశాలలో దింపి తిరుగు ప్రయాణంలో కారు ప్రమాదం సంభవించడంతో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆయన స్వగ్రామమైన నడింపాలెం లో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం విలేకరి సత్యనారాయణ ను యండమూరి వీరేంద్రనాథ్, నేను సైతం ట్రస్ట్ ఛైర్మెన్ కె శివప్రసాద్, లోకుల కిరణ్ మాష్టర్ లు పరామర్శించి ప్రమాదం చోటు చేసుకున్న పరిస్థితి పై అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు అలాగే సత్యనారాయణ త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## 50 కిలోల గంజాయి పట్టివేత, ఏడుగురు అరెస్ట్



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 05) :**గొలుగొండ మండలం కృష్ణదేవిపేట సమీపంలో గురువారం 50 కేజీల గంజాయిని పట్టుకుని ఏడుగురు అరెస్ట్ చేసినట్లు నర్సీపట్నం డిఎస్పి పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్లో డిఎస్పి మీడియా ముందుంచారు. కృష్ణదేవిపేట ఎస్సై రుషికేశ్వరరావు ముందస్తు సమాచారం మేరకు చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. కారులో తరలిపోతున్న 50 కేజీల గంజాయిని పట్టుకున్నారు. రాజవొమ్మంగికి చెందిన గుంటిమల్ల రాజ్ కుమార్ ప్రధాన నిందితుడని అన్నారు. ఇతనిపై ఇప్పటికే 14 కేసులు నమోదయాయని తెలిపారు. చిత్రకొండ వద్ద ఈ గంజాయి కొనుగోలు చేసి రాజమండ్రి వెళుతుండగా పల్లావూరు వద్ద పట్టుకోవడం జరిగిందన్నారు. కుంటిమల్ల రాజ్ కుమార్ తో పాటు మునియప్పన్, కిషోర్, లోవరాజు, ప్రవీణ్ కుమార్, లావణ్య, విజయ్ కుమార్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్దనుండి కారు, మూడు స్కూటీలు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకున్నామని డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో రూరల్ సీఐ రేవతమ్మ, కృష్ణదేవిపేట ఎస్ఐ రుషికేశ్వరరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఐఎఫ్ఆర్ 2026కు విశాఖ సిద్ధం



వి ఎం ఆర్ డి ఎ పర్యాటక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు

**విశాఖ దక్షిణం పెన్ పవర్, ఫిబ్రవరి 05, 2026:** విశాఖపట్నంలో 18, 19 తేదీలలోజరగనున్న అంతర్జాతీయ యుద్ధ నౌకల విన్యాసాలు ఐఎఫ్ఆర్2026 ను పురస్కరించుకొని,వి ఎం ఆర్ డి ఎ పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి, మరమ్మత్తు, పచ్చదనం పెంపు పనుల పురోగతినివి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమం సందర్భంగా విశాఖ నగరం ప్రపంచ దృష్టిని ఆకర్షించనున్న నేప థ్యంలో, పర్యాటక ప్రదేశాలను మరింత సుం దరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికా రులకు చైర్మన్ ఆదేశించారు. మరమ్మత్తు పను లు, హరితాభివృద్ధి కార్యక్రమాలు నిర్దేశిత గడు వులోపు పూర్తిచేయాలని స్పష్టంగా సూచించా రు.

ఈ సందర్భంగా చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐఎఫ్ఆర్ నిర్వహణను విజయవంతం చేసే దిశగా పలు కీలక సూచనలు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు వి ఎం ఆర్ డి ఎ పరిధిలోని అన్ని పర్యాటక ప్రాంతాలను మరిం త ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి పరిశుభ్రతకు అత్యధిక ప్రాధా న్యత ఇవ్వాలని, టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాల్లో పచ్చదనం మరింత పెంచడంతో పాటు సందర్శ కులకు త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పర్యాటకులకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని అన్నారు.అనంతరం అధికారులు కలిసి కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, సీ హారియర్ మ్యూజియం, అహ్యాయ్ హెలికాప్టర్ మ్యూజియం, టియు-142 యుద్ధ విమాన మ్యూజియం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించా రు. అలాగే కైలాసగిరి అభివృద్ధి పనులు, తెన్నేటి పార్క్‌లో చేపడుతున్న పనులను కూడా సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కల్లివానిపాలెంలో పారిశుద్ధ్య లోపం





**ఆనందపురం, పెన్ పవర్,ఫిబ్రవరి 05.**భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలోని కల్లివానిపాలెం గ్రామంలో మురుగు నీరు ఇళ్ల చుట్టూ నిల్వ ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు మూసుకుపోవడం వల్ల పిల్లలు, పెద్దలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామానికి చెందిన పిల్లి కొండమ్మ, బోర నర్సింగ్, పిల్లి తోటమ్మ, బోర నాగ, బోర చిన్న, పిల్లి పైడిరెడ్డి, బోర యారయ్య, ఉప్పాడ రమణ, పిల్లి కనకమ్మ ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వ్యాపించి దోమలు పెరుగుతున్నాయని తెలిపారు. చిలుకూరి లేఅవుట్ యాజమాన్యం మురుగు నీరు బయటకు వెళ్లకుండా అడ్డుకోవడమే సమస్యకు ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.

సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకెళ్లడంతో ఏడాది క్రితమే పైపులు తీసుకొచ్చినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదని గ్రామస్తులు తెలిపారు. కొంతకాలం చిన్న మోటార్ సహాయంతో నీటిని తొలగించేవారని, ప్రస్తుతం అది కూడా నిలిచిపోయిందని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేసి మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## జాతీయ స్కూల్ గేమ్స్ బాక్సింగ్ టీమ్ కోచ్‌గా కృష్ణవేణి



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఫిబ్రవరి 05) :**ఈనెల 5 నుంచి 9 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ విమెన్ అండర్19 బాక్సింగ్ జట్టుకు కోచ్‌గా కోలుకుల కృష్ణవేణిని నియమించారు.

ప్రస్తుతం ఒంగోలులో శాప్ లో ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి, జాతీయ స్థాయిలో మహిళా బాక్సింగ్ కోచ్‌గా ఎంపిక కావడం అభినందనీయమని నింజాస్ అకాడమీ డైరెక్టర్ మెంబెర్స్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రీకాంత్, సుతాపల్లి శ్రావణ్, వెలగా జగన్నాథ్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఇటీవల బాలికలు బాక్సింగ్ వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్న నేపథ్యంలో మహిళా కోచ్‌ను ఈ విధంగా దూర ప్రాంతాలకు పంపడం వల్ల తల్లిదండ్రుల్లో కూడా క్రీడలపై ఆసక్తి పెరుగుతోందని శాప్ కోచ్ అబ్బు, సీనియర్ కోచ్ శేఖర్, మాజీ ఆర్మీ కోచ్ సన్యాసిరావు తెలిపారు.

## కనకదుర్గ నగర్ రాజీవ్ నగర్ సమస్యలను గుర్తించిన అధికారులు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఫిబ్రవరి 5:** జీవీఎంసీ 12 వ వార్డ్ కనకదుర్గ నగర్,రాజీవ్ నగర్లలో ఏళ్ల తరపుడి ప్రజల్లో ఎదురుకుంటున్న శిధిలవస్థితి చేరిన గెడ్డ కాలువలు రోడ్లు ఆధునికరణకు ఏళ్ళ తరబడి ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు, నాయకులు వస్తున్నారు వెళ్తున్నారు సమస్యలు ఎలాస్థితిలో ఉండడంతో ప్రజలు నిరుత్సాహానికి లోనై పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకపోవడంతో ఓటుకు ప్రభుత్వ ఏర్పడిన తరువాత అధికారులు పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి సమస్య పరిష్కరించేందుకు శాసనసభ్యులు అధికారులతో మాట్లాడటం జరుగుతుందని, వీలైనంతవరకు త్వరగా సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని డి ఇ చంద్రమౌళి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలను నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో ఏ ఇ శ్యాం కుమార్,వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ వార్డ్ టిడిపి ఇన్చార్జ్ ఒమ్మి అప్పలరాజు,టిడిపి నాయకులు రామకృష్ణ, రమా పాల్గొన్నారు పాల్గొన్నారు. సందర్భంగా స్థానిక ప్రజలను అడిగి సమస్యలను ఆయన తెలుసుకున్నారు



## చల్లంగి అచ్యుత్‌కు ఘన సన్మానం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 5:**భారతీయ జనతా పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శిగా నియమితులైన చల్లంగి అచ్యుత్‌కు గూడెం కొత్తవీధి మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు.అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండల బీజేపీ మండల అధ్యక్షులు కాకూరు శేఖర్, బీజేపీ ఎంపీటీసీ రిమల రాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గూడెం కొత్తవీధి మండలం నుంచి రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శిగా చల్లంగి అచ్యుత్ నియమితులవడం హర్షణీయమని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా గూడెం కొత్తవీధి మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శిగా ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షురాలు మఠం శాంత కుమారి, స్టేట్ ట్రైకర్ డైరెక్టర్ కృష్ణారావు, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు పాంగి రాజారావు, ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పీ.వి.ఎన్. మాధవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోండ్ల చిరంజీవి, ఎం. లక్ష్మణరావు, లకే రాము, రిమల పాల్, లకే ప్రసాద్, కిముడు ముంది, బౌడు సతీష్ దొర, కె. భాస్కర్, వనపాల లక్ష్మణరావు, మరి బాబు తదితరులు పాల్గొన్నారు.

## జోగుల పుట్టులో బ్యాంక్ పథకాలపై అవగాహన కార్యక్రమం



**జి. మాడుగుల,పెన్ పవర్, ఫిబ్రవరి 5:**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జి. మాడుగుల బ్రాంచ్ ఆధ్వర్యంలో జోగుల పుట్టు గ్రామంలో బ్యాంక్ పథకాలపై ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నా బార్డ్ వారి ఆర్థిక సహకారం అందించారు. బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ నాయుడు మార్గదర్శకత్వంలో విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ కళాజాత వీధినాటిక బృందం ఆటలు, పాటలు, హాస్య సంభాషణలు, మ్యాజిక్ షోలను ప్రదర్శిస్తూ ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పింఛన్ యోజనతో పాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న డిజిటల్ సేవలు, వివిధ బ్యాంక్ పథకాలపై వివరించారు.అలాగే గ్రామంలో గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై కళాజాత రూపంలో అవగాహన కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి.సి. అనిల్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆనందపురం పీహెచ్ సీ ని సందర్శించిన జనాభా పరిశోధనా కేంద్రం బృందం.





**ఆనందపురం, పెన్ పవర్,ఫిబ్రవరి 05:**జనాభా పరిశోధనా కేంద్రం (పాప్యులేషన్ రీసెర్చ్ సెంటర్) బృంద సభ్యులు డా. రమణ యడ్ల, డా. సిహెచ్ పాధాలు జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం మూల్యాంకనంలో భాగంగా ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంజేపీ ఏపీ సంక్షేమ మత్స్యకారుల బాలికల పాఠశాల అమృతపురం భీమిలి, అలాగే కృష్ణపురం ఉపకేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం మరియు అసంఖ్యాక వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల అమలును సమగ్రంగా పరిశీలించారు.

బృందం ఆసుపత్రిలోని మాతృశిశు విభాగం, అసంఖ్యాక వ్యాధుల విభాగం పనితీరును పరిశీలించి, అక్కడ అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య సేవలు, చికిత్సా విధానాలు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై వివరంగా సమీక్ష నిర్వహించింది.

ఈ మూల్యాంకన కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య బృందం నోడల్ అధికారి డాక్టర్ నిత్య, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు డాక్టర్ షేక్ భాను, డాక్టర్ షేక్ షహనాజ్ మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొని బృందానికి అవసరమైన ఏర్పాట్లు చేసి పూర్తి సహకారం అందించారు.

ఈ పరిశీలన ద్వారా జిల్లా స్థాయిలో మానసిక ఆరోగ్య సేవలు మరియు అనుబంధ ఆరోగ్య కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు లభించనున్నాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గూడెం కొత్తవీధిలో మట్టి నమూనాల సేకరణపై శిక్షణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 5:**గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం (ఎన్ఎంఎన్ఎఫ్ )లో భాగంగా వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ, ఆన్లైన్ నమోదు విధానాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు మాట్లాడుతూ ఈ సంవత్సరానికి గూడెం కొత్తవీధి మండలంలో 1,705 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష నిమిత్తం భూసార పరీక్షా కేంద్రానికి పంపించాల్సి ఉందన్నారు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఏ పంటలు సాగు చేయాలి, ఎంతమేరకు ఎరువులు వినియోగించాలి అన్నది నిర్ణయించి భూసారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ డివిజన్ ఇన్చార్జి జవ్వాది వెంకట్, ఆయన సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## చింతపల్లి ఏకలవ్య పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

* ఈఎంఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్



**స్టాఫ్ రిపోర్టర్ మాదిరి చంటిబాబు,చింతపల్లి/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఫిబ్రవరి 5:** కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చింతపల్లి ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చింతపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఫిబ్రవరి 28 లోపు షషష.ఖజ్ఙ్షస్త్రబతీబనిబశ్రీఝఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేయాలి. ప్రవేశానికి మొత్తం 60 సీట్లు ఉంటాయి. ఇందులో బాలురకు 30 మరియు బాలికలకు 30 సీట్లు కేటాయించబడినట్లు తెలిపారు.దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2025-26 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్నవారు కావాలి. అంతేకాదు, వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వార్షిక ఆదాయం ఒక లక్షా రూపాయలలోపు ఉండాలి. దరఖాస్తు చేసిన అభ్యర్థుల కోసం ఏప్రిల్ 4న పరీక్ష నిర్వహించనున్నారు అని ఆయన తెలిపారు.

## ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన కూటమి నాయకులు




**గాజువాక :పెన్ పవర్, ఫిబ్రవరి 05:**జీవీఎంసీ66 వ వార్డు లో నవాబు నగర్ ప్రాంతంలో వార్డులో ఉన్న పరిసర్రృత ఆరోగ్యం సమస్యలపై లెప్రసి సమస్యపై వార్డులో అవగాహన సదస్సు, ప్రతి ఒక్కరికి తెలుసుకోవాల్సిన బాధ్యత పై ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది, ఈ కార్యక్రమానికి టిడిపి వార్డ్ అధ్యక్షుడు గోమాడా వాసు, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, వార్డు ట్రెజరర్ సీనియర్ నాయకులు లక్కోజి లక్ష్మణరావు, మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ భాష, మైనారిటీ నాయకులు అన్సర్ వలి, సీనియర్ నాయకులు సాయిరాం, మహిళా సీనియర్ నాయకురాలు, రాంబాయి, వార్డు ఆర్ పిలీల, ఆ ప్రాంతంలో ఉన్న కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వార్డ్ లో ఉన్న ఏఎన్ఎంలు పాల్గొని లప్రసి వ్యాధిపై ఎంతో చక్కగా అవగాహన కల్పించారు, ఈ వార్డులో ఈ నెల అంతా ప్రతి ఒక్క ప్రాంతానికి వెళ్లి, ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తామని, నాయకులు తెలియజేశారు.

## ధారకొండ హైస్కూల్లో హెచ్ఎం దాడి; ఇద్దరు విద్యార్థులకు గాయాలు?







**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 5:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం ధారకొండ హైస్కూల్లో ఘర్షణాత్మక సంఘటన జరిగింది. భోజనం బాగోలేదని చెప్పిన ఇద్దరు విద్యార్థులను హెచ్ఎం తీవ్రంగా చితకబాదడంతో వారు గాయాల కారణంగా ఆసుపత్రి పాలయ్యారు.స్థానికుల సమాచారం ప్రకారం, గురువారం పాఠశాలలో భోజనం వండుతున్న సమయంలో 8, 9 తరగతి విద్యార్థులు హెచ్ఎంకు "సార్, మా స్కూల్లో రోజువారీ వండే భోజనం బాగోలేదు. మెనూ సక్రమంగా అమలు అయ్యేలా వండించండి" అని చెప్పగా, హెచ్ఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. "నన్నే ఎదిరిస్తారా" అంటూ విద్యార్థులపై కఠినంగా చితకబాడినట్లు తెలిపారు.ఈ ఘటనలో 9వ తరగతి విద్యార్థి హియల్ ప్రభుదాస్ తీవ్రంగా గాయమై ఫిట్స్ వచ్చి స్కూల్లోనే పడిపోయాడు. మరో 9వ తరగతి విద్యార్థి గొల్లోరి విజయ్ కుమార్ను కూడా తీవ్రంగా కొట్టడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. విజయ్ కుమార్ కు ఆందోళనతో ఊపిరి అందకపోవటంతో వైద్యులు ఆక్సిజన్ అందించారు. విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటన గురించి తెలుసుకున్న పాఠశాల స్కూల్ కమిటీ ( హెచ్ఎంసి) చైర్మన్ మణి, విద్యార్థుల తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు. "హెచ్ఎం పై చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.మండల ఎంఈఓ గోవింద్ పడాలు ఈ విషయంపై వివరాలు కోరారు. "విచారణ చేపడతాం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం" అని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతూ స్థానిక ప్రజాప్రతినిధులు వాటిని జిల్లా కలెక్టర్, పిఓకు పంపించినట్టు తెలుస్తోంది.

## మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కొనసాగించాలి

### అనంతగిరి సీపీఎం జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు డిమాండ్



**అనంతగిరి పెన్ పవర్ ఫిబ్రవరి 5,**సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం సీపీఎం పార్టీ అనంతగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో గిరిజన సంఘం కార్యాలయం నుండి తాహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతగిరి సిపిఎం జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు మాట్లాడుతూ జాతి పిత మహాత్మాగాంధీ మీద దురుద్దేశం తో ఉపాధి హామీ పేరు మార్పు చేశారని తెలిపారు. 2005 సంవత్సరం లో కమ్యూనిస్టుల ఒత్తిడితో యూపిఎ 1 ప్రభుత్వం వలస కూలి అరికట్టాలని గ్రామ ప్రాంతంలో పేదరికం నిర్మించాలని ఉద్దేశం తో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ఈరోజు కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాల అవలంభిస్తుందని అందులోనూ భాగంగానే ఉపాధి హామీ పథకం రద్దు చేసేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పథకం కొనసాగించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కిల్లో మోస్య మండల కమిటీ సభ్యులు సోమెల నాగులు కాకర సింగులు దీసరి దేముడుమ్మ స్వాబి కాసులమ్మ గెమ్మెల భీమరాజు సమర్ది నాగేశ్వరరావు శిరగం అప్పలస్వామి,జన్ని సుబ్బారావు,సోమెల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సెంటు స్థలంలో ఇళ్ల స్వాధీన పత్రాలు అందజేసిన



**వార్డు కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు**

**విశాఖ తూర్పు,పెన్ పవర్ ఫిబ్రవరి 5:** జీవీఎంసీ 13 వ వార్డు పైనాపిల్ కాలనీ సచివాలయం-12 లో గురువారం సెంటు భూమి సంబంధించి అర్హులైన ఇళ్ల లబ్ధిదారులకు గతంలో సెంటు స్థలంలో ఇల్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణం పూర్తిచేసినందున ఇల్లు స్వాధీన పత్రాలను లబ్ధిదారులకు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు శ్వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ,వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,బీజేపీ మండలం అధ్యక్షులు కొండపల్లి సతీష్ చేతుల మీదుగా లెఫ్టారులకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వార్డ్ టీడీపీ ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులు మారిక జక్కన్న, కిల్లంశెట్టి శ్రీనివాస్,తెలుగుయువత అధ్యక్షులు వడిశెల శ్రీనివాస్,ప్రసాద్, మాసాబత్తుల శ్రీనివాస్, బూత్ కన్వీనర్స్ కల్లూరి వెంకటేష్, చింతలపూడి నాగేశ్వరావు,గలాల రమణమూర్తి, రొక్కం నరేష్, ఆకాపు శ్యామ్ సుందర్ రావు,బీజేపీ కార్యకర్తలు బండారు శ్రీనివాసరావు, సప్ప త్రినాధ రావు, గుద్ది అచ్యుత రావు, తంగిల్ల ఆనంద్, సోమిరెడ్డి సురేషకుమార్,రెడ్డి సత్తిరాజు, గురజాపు వాసు,టీడీపీ మహిళా నాయకులు పుష్పలత, నూర్జహాన్,కర్రి మణి,మజ్జి శ్రీదేవి,లాలు,సచివాలయం సిబ్బంది,లబ్ధిదారులు, మరియు తదితరులు పాల్గున్నారు.

## జర్రెల కొత్తూరులో ఘనంగా పోతురాజు బాబు పండుగ





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి5:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జర్రెల పంచాయతీ పరిధిలోని జర్రెల కొత్తూరు గ్రామంలో గ్రామ దేవత పోతురాజు బాబు పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, స్వామివారి గ్రామ సేవకులు పొత్తూరు విష్ణుమూర్తి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఏటా ఒకసారి సంప్రదాయబద్ధంగా స్వామివారికి పండుగ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ఈ ఏడాది కూడా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా స్వామివారిని పసుపుకుంకుమ బోనాలతో, డప్పులు, దరువులు, ఆటపాటలతో గ్రామ వీధుల గుండా ఊరేగించారు.అనంతరం స్వామివారి పాదాలకు పసుపుకుంకుమలతో అలంకరణ చేసి అభిషేకం నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలు పూర్వీకులు అనుసరించిన విధానంలోనే నిర్వహించామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు పోతురాజు బాబు తల్లితండ్రుల ఆరాధ్యదైవంతో సమానమైన దేవుడని తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన నారాయణ ప్రసాద సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని నిర్వాహకులు వెల్లడించారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు......




**నాతవరం పెన్ పవర్ (ఫిబ్రవరి 05):** వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టామని నాతవరం ఎంపిడిఒ ఎంఎస్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం నాతవరం ఎంపిడిఒ కార్యాలయంలో బోర్ల మరమ్మత్తులకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఎంపిపి సాగిన లక్ష్మణమూర్తి, జడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ద్వారా ఎక్కడైనా మరమ్మత్తులకు గురైన బోర్లకు రిపేర్లు చేయించడం జరుగుతుందన్నారు.మండలంలో మొత్తం 457 బోర్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పారుపల్లి కొండబాబు, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ దేవదత్తు, మండల పరిషత్ ఏవో పార్ధసారధి, బోరు మెకానిక్లు రామకృష్ణ, నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ 90వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం





**80 అడుగుల బిటి రోడ్డు పనులు ప్రారంభం**

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 5 :** గ్రేటర్ నగరంలో అభివృద్ధి పదంలో దూసుకుపోతున్న జీవీఎంసీ 90వ వార్డులో మరో కీలక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 26వ తేదీన వార్డు రత్నావారి వంటిల్లు నుంచి ఏపీఎస్సిబి కాలనీ, సీతారామరాజునగర్, సుసర్ల కాలనీ వంశీ సూపర్ మార్కెట్ వరకు నిర్మించనున్న 80 అడుగుల వెడల్పు బిటి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విప్,
పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సూచన మేరకు గతంలో జీవీఎంసీ నిధులు రూ.1.90 కోట్లతో ఈ రోడ్డు మరియు సెంటర్ డివైడర్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఆ ప్రాజెక్ట్‌లో భాగంగానే ఈ రోజు రోడ్డు పనులు ప్రారంభించారు.
ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బొమ్మిడి రమణ, డిఈ వెంకటలక్ష్మితో కలిసి పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు అవసరమైన సూచనలు ఇస్తూ, పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, మున్నా, కృష్ణ మోహన్, అజయ్, కిరణ్, పోతల సతీష్, జ్యోతి, వెంకటలక్ష్మి, కొల్లి లక్ష్మి, పలక సత్యవేణి, యశోద తదితరులు పాల్గొన్నారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడంలో కీలకంగా నిలుస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## కళింగపట్నంలో ఘనంగా సీఐఎస్ఎఫ్ సైక్లథాన్

**యూనిఫాం కొలువులకు సిద్ధం కావాలి -ఎమ్మెల్యే గొండు శంకరరావు**



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, గార. ఫిబ్రవరి 05:** దేశ భద్రతలో సముద్ర తీరాల రక్షణ అత్యంత కీలకమని, దానికోసం సిఐఎస్ఎఫ్ జవాన్లు చేస్తున్న సాహసయాత్ర స్ఫూర్తిదాయకమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు పేర్కొన్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధ్వర్యంలో చేపట్టిన 'వందేమాతరం కోస్టల్ సైక్లథాన్–2026' బృందం గురువారం కళింగపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక బుద్ధా స్కూల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కోస్టల్ భద్రతతో పాటు దేశభక్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమని, పురుషులతో సమానంగా మహిళా జవాన్లు సైతం ఈ సైకిల్ యాత్రలో పాల్గొనడం గర్వకారణమని ఆయన కొనియాడారు. యువత దేశ రక్షణకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తీర భద్రత దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని సీఐఎస్ఎఫ్ కమాండెంట్ దువ్వాడ జితేంద్రబాబు స్పష్టం చేశారు. ఉద్యోగార్థులైన యువతకు తీపి కబురు అందిస్తూ.. గత ఏడాది సీఐఎస్ఎఫ్‌లో 16,000 పోస్టులను భర్తీ చేశామని, ఈ ఏడాది మరో 15,000 ఖాళీల భర్తీ జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాలపై యువతకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం శాంతిభద్రతలే కాకుండా, దేశ సంపదను కాపాడటంలో సీఐఎస్ఎఫ్ పాత్రను వివరించారు.

## హెచ్‌ఎం పై కఠిన చర్యలు తీసుకోవాలి..!

**డిఎల్ఓ రాష్ట్ర అధ్యక్షుడు,గాలికొండ ఎంపిటిసి డిమాండ్.**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 5:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలో దారకొండ హై స్కూల్లో మెనూ బాగోలేదని ప్రశ్నించిన విద్యార్థులను తీవ్రంగా కొట్టి ఆసుపత్రిపాలు చేసిన దారకొండ హెచ్‌ఎం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సంఘటన అనంతరం సిపిఎం మండల కార్యదర్శి గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు. డిఎల్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మార్కురాజ్ ఈ సంఘటనపై తీవ్రంగా ఖండించారు. చదువు చెప్పవలసిన హెచ్‌ఎం విద్యార్థులను తీవ్రంగా కొట్టడం చాలా దారుణమని ఇలాంటి ఉపాధ్యాయుడ్ని ఉపేక్షించ రాదని వారు డిమాండ్ చేసారు. స్టాక్ రూమ్ పరిశీలనకు వెళ్లిన గిరిజన సంఘం నాయకులు 260 మంది ఉన్న విద్యార్థులకు రెండు కేజీలు ఉల్లిపాయలు, ఐదు కేజీల కుళ్ళిపోయిన అల్లం, కాలిఫ్లవర్, క్యాబేజీ మాత్రమే ఉన్నాయని ప్రభుత్వం అందిస్తున్న సరుకులు విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు చేయకుండా హెచ్‌ఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సంఘటనపై తక్షణమే జిల్లా అధికారులు స్పందించి హెచ్‌ఎంపై తగు చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రం ను ముస్తాబు చేసిన సర్పంచ్.





**గుమ్మలక్ష్మీపురం ఫిబ్రవరి 05 పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి చెట్టు కింద విశ్రాంతి బెంచీలు ఏర్పాటు చేసిన గుమ్మలక్ష్మీపురం గ్రామపంచాయతీ సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్. ఈ మేరకు సర్పంచ్ గురువారం నాడు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ. ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించేందున వచ్చిన మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి,ఆసుపత్రి ముందు చుట్టుప్రక్కల ముస్తాబ్ చేసి ఎదురుగా ఉన్న చెట్లు కింద ఆసుపత్రికు వచ్చిన ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేయాలని ఆనాడు ఆదేశించారని. కలెక్టరు సూచనలను గౌరవించి తక్షణమే ఆసుపత్రి చుట్టుప్రక్కల ముస్తాబ్ చేసి ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా బెంచీలు వేయడం జరిగిందని బొత్తాడు గౌరీశంకర్ అన్నారు. అలాగే అక్కడున్న సిబ్బందికు ప్రజలకు చుట్టుప్రక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏర్పాటుచేసిన చెత్తబుట్ట లోనే చెత్త వెయ్యాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

## డైకిన్‌లో 81 మందికి ఉద్యోగాలు

**నరవ బెహరా పాలిటెక్నిక్ విద్యార్థులకు ఘన విజయం**



**పెందుర్తి, పెన్ పవర్, ఫిబ్రవరి 5 :** స్థానిక పెందుర్తి నియోజకవర్గం, నరవ గ్రామంలో ఉన్న బెహరా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న 81 మంది విద్యార్థులు ప్రముఖ ఏసీ తయారీ సంస్థ డైకిన్లో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ సుకన్య తెలిపారు. చిత్తూరు జిల్లా సిటీ సెజ్లో ఉన్న డైకిన్ ఏసీ కంపెనీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఈ ఉద్యోగాలు లభించాయని ఆమె వివరించారు. ఇంటర్వ్యూలో విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను ప్రదర్శించి ఎంపికయ్యారని చెప్పారు.
ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి మూడు లక్షల రూపాయలకు పైగా వేతనం, అలాగే ఉచిత రవాణా సదుపాయం మరియు ఉచిత వసతి కల్పించనున్నట్లు డైకిన్ సంస్థ ప్రకటించిందని సుకన్య తెలిపారు. ఇది విద్యార్థులకు ఆర్థికంగా, వృత్తిపరంగా మంచి ఆరంభమని పేర్కొన్నారు.
డైకిన్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను బెహరా విద్యాసంస్థల సెక్రటరీ డా. చైతన్య అభినందించారు. క్రమశిక్షణ, కష్టపడే స్వభావంతో భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇటువంటి విజయాలు కళాశాల ప్రతిష్టను మరింత పెంచుతాయని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో డైకిన్ సంస్థ ప్రతినిధులు అరుణ్ ప్రసాద్, మదన్ రాజ్, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయంపై అధ్యాపకులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## వేసవిలో మంచినీటి ఎద్దడిని తట్టుకునేలా ముందస్తు జాగ్రత్తలు

- 247 బోర్లు, 332 డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ అందుబాటులో



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఫిబ్రవరి 5:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలానికి చెందిన 344 గ్రామాల్లో 247 బోర్లు మరియు 332 డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ అందుబాటులో ఉన్నాయని ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వివరాలను ఆయన సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్‌లో భాగంగా వెల్లడించారు. ఎంపీడీవో ఫిబ్రవరి 5 నుండి మార్చి 15 తేదీల మధ్య అన్ని డ్రింకింగ్ వాటర్ పథకాలు మరియు చేతి పంపులను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన మరమ్మత్తులు చేసి వేసవిలో మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ జెఈ కళ్యాణ్ బాబు, గృహ నిర్మాణ శాఖ ఏఈ పసుపులేటి లక్ష్మీ విమల, పంచాయితీ కార్యదర్శులు, గృహ నిర్మాణ శాఖ వర్కు ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను పరిశీలించిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఫిబ్రవరి 5 :** జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని ఇందిరానగర్ నుంచి లక్ష్మీనగర్, బుచ్చిరాజుపాలెం, మిదిగా ఎన్ఏడి కొత్తరోడ్ వరకు జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు నిత్యం నడిచే మార్గంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పనులు చేపట్టాలని, ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేసి, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు సక్రమంగా ఏర్పాటు చేయాలని గణబాబు అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కూటమి నేతలు, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న విశాఖ దక్షిణ ఎమ్మెల్యే దంపతులు



**సింహాచలం, పెన్ పవర్, ఫిబ్రవరి 5 :** విశాఖ నగరానికి ఆధ్యాత్మిక హృదయంగా నిలిచిన ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో కొలువై ఉన్న శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామివారిని విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ గురువారం తన సతీమణితో కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు దేవస్థానం ప్రోటోకాల్ పర్యవేక్షణ అధికారి పూసపాటి సునీల్ కుమార్, జూనియర్ సహాయకులు వరాహ నరసింహం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆలయ పర్యవేక్షణ అధికారి కె.వెంకటేశ్వరరావు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, ఆలయ ఆచార సంప్రదాయాలను అనుసరిస్తూ స్వామివారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు సింహాచల క్షేత్రంలోని అత్యంత మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు.
అనంతరం గర్భాలయంలో ప్రవేశించి శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి దివ్య రూపం, సింహాచల క్షేత్ర మహత్యం, చారిత్రక ప్రాశస్త్యం గురించి ఎమ్మెల్యే దంపతులకు వివరించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు నాదస్వర మంగళ వాయిద్యాల మధ్య వేద మంత్రోచ్ఛారణలతో ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరరావు స్వామివారి శేష వస్త్రంతో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. అలాగే స్వామివారి జ్ఞాపికగా చిత్రపటాన్ని, పవిత్ర ప్రసాదాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.
ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ దంపతులు స్వామివారి దర్శనం అనంతరం సింహాచల దేవస్థానం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఆందోళన







- ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించి రోజుకి 600 కూలి వేతనాలు.
- జెడ్ పి అతిథి గృహం నుండి నాలుగురోడ్ల కూడలి మీదుగా భారీ ర్యాలీగా వెళ్ళి తహసిల్దార్ కార్యాలయంలో ఆందోళన.
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ డిమాండ్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఫిబ్రవరి 05.** ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని మండల సిపిఎం నేతల ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గురువారం సిపిఎం మండల కమిటీ సభ్యులు పి.భీమరాజు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం మండల కార్యదర్శి కొర్రా త్రినాథ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణ చేసి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ఆయన అన్నారు. రోజుకి 600 రూపాయలు ఉపాధిహామీ కూలీలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం షరతులు లేకుండా పని కల్పించాలని కోరారు. అలాగే పీఎం జన్ మన్, జనరల్ కేటగిరీకి ఇల్లులకు ధరలకు అనుగుణంగా యూనిట్ కాస్ట్ 10 లక్షలు ఇవ్వాలని, సక్రమంగా బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. బిల్లులు చెల్లింపులు నిర్లక్ష్యం చేస్తే మరో మారు ఉద్యమానికి సిద్ధం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టం మార్పు చేయకుండా యధావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి,సత్యనారాయణ, సిపిఎం నేతలు ఎంఎం శ్రీను, కె.నర్సయ్య, ఎస్.గాసీరాం దొర, జి.నారాయణ, పి.రామదాసు, కె.శంకర్ రావు, జి.జిన్నబంధు, డోంబ్రు, శ్రీను, నీలకంఠం, దేవ, పరశురామ్, అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com